# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నంచడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 1 సంచిక : 322 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కావలి, నెల్లూరుజిల్లా శనివారం 26 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :322 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAVALI, NELLORE DIST, SAT 26 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : ,SPSR Nellore, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa, Hyderabad, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహాగణపతి..

### ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనం



- హుస్సేన్‌సాగర్‌లో ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం పూర్తి
- 69 అడుగుల పంచముఖ గణపతిగా దర్శనమిచ్చిన విగ్రహం
- క్రేన్ నంబర్ 4 వద్ద మధ్యాహ్నం 2.15 గంటలకు నిమజ్జనం
- పటిష్ఠ బందోబస్తు నడుమ ప్రశాంతంగా ముగిసిన వేడుక

హైదరాబాద్‌లోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన వేడుకలు శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఏడాది 69 అడుగుల ఎత్తుతో 'పంచముఖ సంకటహర మహాగణపతి'గా భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారి విగ్రహాన్ని వేలాది మంది భక్తుల జయజయధ్వానాల మధ్య హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేశారు.

- మిగతా 2లో





### బడా గణేశ్ శోభాయాత్ర: పోలీసులతో కలిసి స్టెప్పులేసిన దానం నాగేందర్

- ఖైరతాబాద్ గణేశ్ శోభాయాత్రలో డ్యాన్స్ చేసిన దానం నాగేందర్
- మహిళా కానిస్టేబుళ్లతో కలిసి స్టెప్పులేసిన వైనం
- 'ప్యారడైజ్' సినిమా పాటకు డ్యాన్స్ చేసి ఉత్సాహం పంచారు
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియో
- బడా గణేశ్ నిమజ్జన వేడుకల్లో చోటుచేసుకున్న ఘటన





## పెట్టుబడులే లక్ష్యంగా మంత్రి లోకేశ్ అహ్మదాబాద్ పర్యటన

- టోరెంట్, వెల్ స్పన్, ఆస్టల్.. అహ్మదాబాద్‌లో రెండో రోజు కూడా నారా లోకేశ్ బిజీబిజీ
- అహ్మదాబాద్ పర్యటనలో పారిశ్రామిక దిగ్గజాలతో మంత్రి లోకేశ్ వరుస సమావేశాలు
- క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టుల కోసం ఏపీని ఎంచుకోవాలని టోరెంట్ గ్రూప్‌కు పిలుపు
- విశాఖలో టైర్ల తయారీ, డేటా సెంటర్ల ఏర్పాటుపై పలు సంస్థలతో కీలక చర్చలు
- కాకినాడ, నెల్లూరులలో ఇండస్ట్రియల్ పార్కులు, రిఫైనరీలు స్థాపించాలని విజ్ఞప్తి
- లోకేశ్ ప్రతిపాదనలను పరిశీలిస్తామని సానుకూలంగా స్పందించిన కంపెనీలు

పెన్ పవర్ డెస్క్:ఏపీకి పెట్టుబడులే లక్ష్యంగా ఏపీ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ విస్తృత పర్యటనలు కొనసాగిస్తున్నారు. గుజరాత్ లోని అహ్మదాబాద్ టూర్‌లో భాగంగా రెండో రోజైన శుక్రవారం ఆయన పలు పారిశ్రామిక దిగ్గజాలతో సమావేశమయ్యారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించడమే ధ్యేయంగా ఏడు ప్రముఖ సంస్థల అధిపతులు, ప్రతినిధులతో చర్చలు జరిపారు. క్లీన్ ఎనర్జీ, ఫార్మా, టెక్స్‌టైల్స్, మౌలిక సదుపాయాలు, డేటా సెంటర్లు,

- మిగతా 2లో

## ఏపీ హోంగార్డులకు శుభవార్త.. కానిస్టేబుల్ ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్

- ఏపీలోని హోంగార్డులకు ప్రభుత్వం శుభవార్త
- కానిస్టేబుల్ డ్రైవర్ పోస్టుల నియామకాల్లో 10 శాతం రిజర్వేషన్
- ప్రభుత్వ పాత ఉత్తర్వులను సవరిస్తూ కొత్త జీవో జారీ
- పోలీస్ రవాణా విభాగంలో 198 పోస్టుల భర్తీకి రంగం సిద్ధం

- మిగతా 2లో




## ఏపీలో వర్ష బీభత్సం.. అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు కీలక ఆదేశాలు

- తీవ్ర వాయుగుండం వల్ల రాష్ట్రంలో పంట నష్టంపై తక్షణ అంచనాకు ఆదేశం
- పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని అధికారులకు సూచన
- ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో మంత్రి అచ్చెన్నాయుడు టెలీకాన్ఫరెన్స్
- పొలాల్లోని నీటిని తొలగిస్తూనే, భవిష్యత్తు కోసం నిల్వ చేయాలని దిశానిర్దేశం
- రైతులకు సాంకేతిక సలహాలు అందించి అండగా నిలవాలని స్పష్టం



పెన్ పవర్ డెస్క్:తీవ్ర వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలుల వల్ల జరిగిన పంట నష్టాన్ని తక్షణమే అంచనా వేయాలని అధికారులను ఆదేశించినట్టు ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. దెబ్బతిన్న రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని స్పష్టం చేసినట్టు ఆయన వెల్లడించారు.

- మిగతా 2లో

## మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- విజయవాడలో తొలిసారి నేషనల్ సరస్ ప్రదర్శన
- ఏర్పాట్లను పరిశీలించిన కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్
- మహిళా సంఘాల ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ సౌకర్యం కల్పించడమే లక్ష్యమని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం, వారి ఆర్థిక సాధికారతను పెంపొందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. విజయవాడలో తొలిసారిగా నిర్వహిస్తున్న 'నేషనల్

- మిగతా 2లో



## ఎన్నికల సంఘంలో విభేదాలు అంటూ కథనం.. ఆందోళన వ్యక్తం చేసిన జగన్

- ప్రస్తుత నియామక చట్టాన్ని సవరించాలని కేంద్రానికి డిమాండ్
- ప్రధాని, ప్రతిపక్ష నేతతో పాటు సీజేఐ కూడా కమిటీలో ఉండాలన్న జగన్
- ఈసీలో కమిషనర్ల అభ్యంతరాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని సూచన
- ఏపీలో గతంలో తమ అభ్యంతరాలను పట్టించుకోలేదని ఆరోపణ

పెన్ పవర్ డెస్క్:కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ)లో అంతర్గత విభేదాలు ఉన్నట్టు జాతీయ మీడియాలో కథనం రావడం, దేశవ్యాప్తంగా ప్రకంపనలు రేగడంపై వైసీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం జగన్ స్పందించారు.

- మిగతా 2లో



## సీఈసీ రాజీనామాకు డిమాండ్.. దేశవ్యాప్తంగా నిరసనలు..




### ఓట్ల దొంగలను వదిలిపెట్టమంటూ నినాదాలు

పెన్ పవర్ డెస్క్:కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కార్యదర్శి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఓట్ల దొంగ, దేశద్రోహి,

- మిగతా 2లో

## స్టాలిన్ గారూ, ఈ కేసుపై నోరు విప్పండి



### సీఎం విజయ్ ఆగ్రహం

- వీరమణి లైంగిక వేధింపుల కేసుపై నోరు విప్పాలన్న విజయ్
- డీఎంకే హయాంలోనే కేసును తొక్కిపెట్టారని తీవ్ర ఆరోపణలు
- ఈ విషయంలో డీఎంకే, ఏఐఏడీఎంకే కుమ్మక్కయ్యాయని విమర్శ
- ఉప ఎన్నికల ప్రచారంలో స్టాలిన్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేసిన సీఎం విజయ్

- మిగతా 2లో

## 'బ్రహ్మోస్'తో పాకిస్థాన్‌కు నిద్రలేని రాత్రులు

పెన్ పవర్ డెస్క్: ఉత్తర్‌ప్రదేశ్‌లో తయారవుతున్న బ్రహ్మోస్ క్షిపణులతో దాయాది పాకిస్థాన్ నిద్రలేని రాత్రులు గడుపుతోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. అమేఠీలో తయారవుతున్న ఏకే-203 రైఫిళ్లు మావోయిస్టులు, ఉగ్రవాదులను బెంబేలెత్తిస్తున్నాయని వ్యాఖ్యానించారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ ప్రయోగించిన బ్రహ్మోస్ క్షిపణులు శత్రు స్థావరాలను

- మిగతా 2లో



## సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కేకు.. ఢిల్లీ హైకోర్టు నోటీసులు

పెన్ పవర్ డెస్క్:జంతర్ మంతర్ నిరసనల్లో ఓ మహిళ ఫొటోల ప్రదర్శనపై ఢిల్లీ హైకోర్టు సీజేపీ ప్రతినిధులకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే తోపాటు సౌరభ్ దాస్, అశుతోష్ రాంకా,

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

### ఎన్నికల సంఘంలో విభేదాలు అంటూ కథనం..
# ఆందోళన వ్యక్తం చేసిన జగన్

- మొదటి పేజి తరువాయి

ఈసీ పనితీరు, నియామకాల పద్ధతిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగబద్ధ సంస్థలపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం నిలబడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక సుదీర్ఘ పోస్ట్ చేశారు. ఎన్నికల కమిషనర్ల నియామకం కోసం ఉద్దేశించిన 'చీఫ్ ఎలక్షన్ కమిషనర్ అండ్ అదర్ ఎలక్షన్ కమిషనర్స్ యాక్ట్, 2023'ను పునఃసమీక్షించి, సవరించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఇటీవల జాతీయ మీడియాలో వచ్చిన కథనాలను జగన్ తన పోస్టులో ప్రస్తావించారు. ఎన్నికల సంఘం తీసుకున్న పలు నిర్ణయాలు, ఓటర్ల జాబితాల రూపకల్పన, ఈసీఐనెట్ నిర్వహణ వంటి అంశాలపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారన్న వార్తలు ప్రజల్లో తీవ్రమైన ప్రశ్నలు, సందేహాలకు తావిస్తున్నాయని పేర్కొన్నారు. ఆరోపణలు, ప్రత్యారోపణల కంటే.. ఏయే అంశాలపై అభ్యంతరాలు నమోదయ్యాయి, వాటిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు, ఓటర్ల జాబితాలో పేర్ల చేర్పులు, తొలగింపులు, పునరుద్ధరణ ప్రక్రియ ఎంత పారదర్శకంగా జరిగిందనే దానిపై ప్రజలకు స్పష్టత అవసరమని జగన్ నొక్కిచెప్పారు. ఈ విషయాలపై ప్రజలకు నమ్మకం కలిగించే చర్యలు తక్షణమే చేపట్టాలని సూచించారు.ఈ నేపథ్యంలో, గతంలో తాము కూడా మద్దతు ఇచ్చిన 2023 నాటి ఎన్నికల కమిషనర్ల నియామక చట్టాన్ని ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా పునఃసమీక్షించాల్సిన అవసరం ఉందని జగన్ పేర్కొన్నారు. ఈ భయాలను తొలగించి, సాధారణ పరిస్థితులను నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వమే ముందుకు రావాలని కోరారు. ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)లతో కూడిన త్రిసభ్య కమిటీ ద్వారానే ఎన్నికల కమిషనర్లను నియమించే పాత విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. "పరీక్ష రాసే విద్యార్థి, తన ఎగ్జామినర్ ను నియమించుకుంటే, ఆ అధికారి ఎంత నిజాయతీపరుడైనా ఆరోపణలకు ఆస్కారం ఉంటుంది. ఆ స్థానంలో ఒక తటస్థ వ్యక్తి ఉంటేనే మేలు" అని జగన్ ఉదహరించారు. ఈ మార్పు ఎన్నికల సంఘంపై ప్రజల గౌరవాన్ని, విశ్వాసాన్ని కచ్చితంగా పునరుద్ధరిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.ఆంధ్రప్రదేశ్‌లో తమ పార్టీ ఎదుర్కొన్న అనుభవాలను కూడా జగన్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఏపీలో ఎస్ఐఆర్ (ూ×=) ప్రక్రియ సమయంలో అధికార పార్టీ తన అధికారాన్ని దుర్వినియోగం చేసిందని, అనేక సందర్భాల్లో తమ విజ్ఞప్తులను పట్టించుకోలేదని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలోనూ డివిజన్ల పునర్విభజన తీరుపై ప్రతిపక్షంగా తాము లేవనెత్తిన అభ్యంతరాలను పక్కన పెట్టేశారని అన్నారు. ఇలాంటి చర్యలు ఎన్నికల ప్రక్రియపై ప్రజా విశ్వాసాన్ని బలహీనపరుస్తాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండటమే కాదు, అవి ఉన్నట్టుగా కనిపించాలని, వాటిని కాపాడటమే రాజ్యాంగ సంస్థల ప్రాథమిక విధి అని జగన్ తన పోస్టులో స్పష్టం చేశారు.

ఈ వార్త మీకు నచ్చిందా?.. నచ్చిన వార్తలను మీ మిత్రు

# సీఈసీ రాజీనామాకు డిమాండ్..
# దేశవ్యాప్తంగా నిరసనలు..

- మొదటి పేజి తరువాయి

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన జ్ఞానేష్ కుమార్ ను తక్షణమే పదవినుంచి తొలగించాలని, అరెస్ట్ చేసి జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. పరస్పర ప్రయోజనాలకోసం ప్రధాని మోదీ, సీఈసీ జ్ఞానేష్ కుమార్ తో కుమ్మక్కై ఎన్నికల వ్యవస్థను భ్రష్టు పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్ల దొంగలను వదిలిపెట్టే ప్రసక్తే లేదని శపథం చేశారు.

**యూపీ, లక్నోలో..**

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ యూపీ రాజధాని లక్నోలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున నిరసనలకు దిగారు. ఓట్ల దొంగతనానికి పాల్పడి జ్ఞానేష్ దేశద్రోహానికి పాల్పడ్డారు..ఎన్నికల కమిషనర్ పదవిలో కొనసాగే అర్హత ఆయనకు లేదు. ఓట్లను దొంగిలించి ప్రజాస్వామ్యంపై ప్రత్యక్ష దాడి చేశారు, ఇది క్షమించరాని నేరమని ఆయన తక్షణమే పదవి నుండి తొలగించి, అరెస్టు చేయాలని నిరసనకారులు నినాదాలు చేశారు.

**పశ్చిమ బెంగాల్ లో..**

దేశ ద్రోహుల చేతినుంచి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, ఎలక్షన్ సిస్టమ్ లో జవాబుదారీతనం కావాలని పశ్చిమ బెంగాల్ లో పెద్ద ఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి నిరసనలు వ్యక్తం చేశారు. భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రధాని మోదీ, సీఈసీ జ్ఞానేష్ కుమార్ కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని, ఆయనను అరెస్టును డిమాండ్ చేశారు. క్విడ్ ప్రో కో (పరస్పర ప్రయోజనం) కోసం పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో జ్ఞానేష్ కీలక పాత్ర పోషించారని దుయ్యబట్టారు. అందుకే జ్ఞానేష్ కుమార్ కు పద్మ భూషణ్ పురస్కారం ఇవ్వాలని బీజేపీ వర్గాలు ఇప్పుడు డిమాండ్ చేస్తున్నాయని విమర్శించారు. బీజేపీ, సీఈసీ వీరంతా ఓట్ల దొంగల ముఠా అని నినాదాలు చేశారు.

**పంజాబ్ లో..**

ప్రజాస్వామ్యంలో ఓట్లను దొంగిలించడం దేశద్రోహమే అవుతుంది.. ఈ పనికి పాల్పడిన సీఈసీ జ్ఞానేష్ కుమార్ వెంటనే రిజైన్ చేయాలని , అయనను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ పంజాబ్ లో ఆందోళనలు జరిగాయి. రాజ్ బ్రార్ నాయకత్వంలో పంజాబ్ కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలిపారు. దీజీూ, –జజుజల నిరంకుశ పోకడను సవాల్ చేశారు.

**హర్యానాలో..**

ఓట్ల చోరీలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని వెంటనే జ్ఞానేష్ కుమార్ అరెస్ట్ చేయాలని హర్యానా కాంగ్రెస్ నేతృత్వంలో పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి. ప్రజల హక్కులపై దాడి చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఇక జ్ఞానేష్ కుమార్ ప్రధాని మోదీ కూడా కాపాడలేరని స్పష్టం చేశారు కాంగ్రెస్ నేతలు. ఈ నిరసనల్లో భారీ సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. భారీ ర్యాలీగా వస్తున్న కార్యకర్తలను బారికేడ్లు పెట్టి పోలీసులు అడ్డుకున్నారు. నిరసనకారులపై వాటర్ క్యానన్లు ప్రయోగించారు.

**బిహార్ లో..**

సీఈసీ జ్ఞానేష్ కుమార్ ప్రజల తీర్పును అపహాస్యం చేస్తూ దేశద్రోహానికి పాల్పడ్డారని, వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బీహార్ రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్ర కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసనలు వెల్లువెత్తాయి. నిరసనల్లో పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొని మోదీ, జ్ఞానేష్ కుమార్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

**మణిపూర్ లో..**

సీఈసీ జ్ఞానేష్ కుమార్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నిరసనలు తలెత్తాయి. జ్ఞానేష్ కుమార్ ను పదవి నుంచితొలగించి అరెస్ట్ చేయాలని ఓక్రమ్ ఇబోబి సింగ్ నేతృత్వంలోని మణిపూర్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆందోళనలు చేపట్టింది. ప్రజాస్వామ్యాన్ని ఖూని చేసిన దేశ ద్రోహికి కఠిన శిక్ష పడేవరకు నిరసనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

**ఒడిశాలో..**

సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా, అరెస్ట్ ను డిమాండ్ చేస్తూ ఒడిశాలో కూడా నిరసనలు వెల్లువెత్తాయి. ఎన్నికల వ్యవస్థలో జవాబుదారి తనం కోరుతూ ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలిపారు. రాజ్యాంగం చేతబట్టుకొని ప్రధానిమోదీ, జ్ఞానేష్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తే ఆందోళన వ్యక్తం చేశారు.

**సిమ్లా, హిమాచల్ ప్రదేశ్ లో..**

సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఓట్లను చోరీ చేసి దేశ ద్రోహానికి పాల్పడ్డారు. ఇది ఎప్పటికీ క్షమించరాని నేరం. జ్ఞానేష్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలి. అతడిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ హిమాచల్ ప్రదేశ్ రాజధాని సిమ్లాలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు జరిగాయి. యువత, మహిళలు నిరసనల్లో పాల్గొని ప్రధాని మోదీ, జ్ఞానేష్ కుమార్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ ఇంఛార్జ్, అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం సమక్షంలో పెద్ద ఎత్తున కార్యకర్తలు నిరసనల్లో పాల్గొన్నారు.

**ఉత్తరాఖండ్ లో..**

సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తూ ఉత్తరాఖండ్ లో కూడా నిరసనలు వెల్లువెత్తాయి. ఉత్తరాఖంవడ్ ఇన్‌ఛార్జ్ జనరల్ సెక్రటరీ కుమారి సెల్జా జీ, రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ గోడియాల్ జీ , జుూ నేతల యశ్పాల్ ఆర్య జీ సమక్షంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఓట్లను దొంగిలించి జ్ఞానేష్ కుమార్ దేశద్రోహానికి పాల్పడ్డారని వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

**జమ్మూ కాశ్మీర్ లో..**

సీఈసీ జ్ఞానేష్ కుమార్ కు వ్యతిరేకంగా జమ్మూ కాశ్మీర్ లో పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి. జ్ఞానేష్ కుమార్ ను పదవినుంచి తొలగించాలని, అరెస్ట్ చేయాలని, ఓట్ల దొంగతనం చేసినందుకు గాను కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు.

# గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహాగణపతి...

ఉదయం 9.30 గంటలకు ఖైరతాబాద్ నుంచి మహాగణపతి శోభాయాత్ర వైభవంగా ప్రారంభమైంది. యాత్ర ప్రారంభంలో దానం నాగేందర్ గణనాథుడి ఎదుట డ్యాన్స్ చేసి అందరిలో ఉత్సాహాన్ని నింపారు. 'గణపతి బప్పా మోరియా' అంటూ భక్తులు చేసిన నినాదాలతో పరిసర ప్రాంతాలన్నీ మార్మోగాయి. ఈ శోభాయాత్ర సెన్సేషన్ థియేటర్, రాజ్‌దూత్ చౌరస్తా, టెలిఫోన్ భవన్, ఇక్బాల్ మినార్, తెలంగాణ తల్లి చౌరస్తా మీదుగా ఎన్టీఆర్ మార్గ్‌కు చేరుకుంది.ఎన్టీఆర్ మార్గ్‌లో ఏర్పాటు చేసిన క్రేన్ నంబర్ 4 వద్దకు విగ్రహాన్ని చేర్చిన అనంతరం, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 2.15 గంటలకు భారీ క్రేన్ల సహాయంతో విగ్రహాన్ని సాగరంలో నిమజ్జనం చేశారు. తమ ఆరాధ్య దైవమైన గణనాథుడికి భక్తులు అశ్రునయనాలతో ఘనంగా వీడ్కోలు పలికారు. పోలీసు యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిమజ్జన ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది.

**బడా గణేశ్ శోభాయాత్ర: పోలీసులతో కలిసి స్టెప్పులేసిన దానం నాగేందర్**

హైదరాబాద్‌లోని ప్రఖ్యాత ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన శోభాయాత్ర వైభవంగా సాగుతోంది. ఈ వేడుకల్లో భాగంగా దానం నాగేందర్ ఉత్సాహంగా నృత్యం చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. శుక్రవారం వైభవంగా సాగుతున్న శోభాయాత్రలో ఈ ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. బందోబస్తు విధుల్లో ఉన్న కొందరు మహిళా కానిస్టేబుళ్లతో

కలిసి దానం నాగేందర్ నృత్యం చేశారు. ఇటీవల విడుదలైన 'ప్యారడైజ్' చిత్రంలోని ఒక పాటకు ఆయన ఉత్సాహంగా స్టెప్పులు వేసి వేడుకల్లో జోష్ నింపారు. పండుగ వాతావరణంలో ఆయన చేసిన ఈ నృత్యం అక్కడ ఉన్న భక్తులను, చూపరులను విశేషంగా ఆకట్టుకుంది.ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దానం నాగేందర్ నృత్యంపై నెటిజన్లు విభిన్న రీతుల్లో స్పందిస్తున్నారు. కొందరు ఆయనలోని ఉత్సాహాన్ని ప్రశంసిస్తుండగా, మరికొందరు ఈ అంశంపై రాజకీయ కోణంలో వ్యాఖ్యలు చేస్తున్నారు.

# ఏపీలో వర్ష బీభత్సం.. అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు కీలక ఆదేశాలు

- మొదటి పేజి తరువాయి

క్షేత్రస్థాయిలో రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.ఈ మేరకు ఆయన ఉన్నతాధికారులతో శుక్రవారం ప్రత్యేక టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బూడితి రాజశేఖర్, ఇతర ఉన్నతాధికారులతో పాటు పార్వతీపురం మన్యం, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, శ్రీకాకుళం జిల్లాల కలెక్టర్లతో మాట్లాడారు. వ్యవసాయ, ఉద్యాన పంటలకు జరిగిన నష్టంపై వెంటనే క్షేత్రస్థాయి సర్వే ప్రారంభించి, వివరాల నమోదును వేగవంతం చేయాలని ఆదేశించారు. పొలాల్లో నిలిచిన నీటిని తొలగించడం, అధిక తేమ వల్ల పంటలు దెబ్బతినకుండా రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు అందించి, వారిలో అవగాహన కల్పించాలని సూచించారు.ప్రజల రాకపోకలకు ఆటంకం కలగకుండా దెబ్బతిన్న ముఖ్యమైన రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. జిల్లా యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను సమీక్షించాలని స్పష్టం చేశారు.

అదే సమయంలో, ప్రస్తుతం కురుస్తున్న వర్షపు నీటిని సాధ్యమైనంత మేర సంరక్షించుకోవాలని మంత్రి సూచించారు. పంటలకు హాని కలిగించే చోట నీటిని తొలగిస్తూనే, చెరువులు, జలాశయాలు, ఇతర నీటి వనరుల్లో నీటిని నిల్వ చేసి భవిష్యత్తు సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్య శాఖలు సమన్వయంతో పనిచేస్తూ రైతులకు, ప్రజలకు నిరంతర సహాయం అందించాలని అచ్చెన్నాయుడు ఆదేశించారు.

## 'బ్రహ్మోస్'తో పాకిస్థాన్‌కు నిద్రలేని రాత్రులు

- మొదటి పేజి తరువాయి

నాశనం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. నోయిడాలో నిర్వహించిన ఉత్తర్‌ప్రదేశ్ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. 2017 తర్వాత భాజపా హయాంలో యూపీ అద్భుత ప్రగతి సాధిస్తోందన్నారు.ప్రధాని మోదీ సారథ్యంలో భారత్ గణనీయమైన ఆర్థిక వృద్ధి సాధిస్తోందన్న అమిత్ షా.. ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ, ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేనప్పటికీ స్థిరమైన వృద్ధిరేటు సాధిస్తున్నామన్నారు. భారత ఆర్థిక వ్యవస్థను ఉన్నత స్థితికి చేర్చే లక్ష్యంగాలో భాగంగానే.. మారిషస్, యూఏఈ, ఆస్ట్రియా, యూకే, ఒమన్, న్యూజిలాండ్, యూరోపియన్ యూనియన్ తదితర దేశాలతో భారత్ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు చెప్పారు. యూపీలో అమలు చేస్తున్న 'వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్' విధానాన్ని అమిత్ షా అభినందించారు. గతంలో ఇక్కడి ప్రజలు ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లేవారని.. కానీ, ఎన్డీయే ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత పరిస్థితులు మారాయన్నారు. గతంలో నేరపూరిత వాతావరణం ఉన్న రాష్ట్రం.. ఇప్పుడు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలో రక్షణ రంగం, వాహన ఉత్పత్తి, వైద్యపరికరాల తయారీ వైపు దూసుకెళ్తోందని కితాబిచ్చారు. సరిగ్గా 12 ఏళ్ల క్రితం ఇదే రోజున (సెప్టెంబర్ 25) ప్రధాని మోదీ 'మేక్ ఇన్ ఇండియా' నినాదం తీసుకొచ్చినట్లు అమిత్ షా గుర్తు చేశారు.

# స్టాలిన్ గారూ, ఈ కేసుపై నోరు విప్పండి

తమిళనాడు రాజకీయాలు మరోసారి రసవత్తరంగా మారాయి. ప్రముఖ గ్రానైట్ వ్యాపారి ఆర్. వీరమణిపై నమోదైన లైంగిక వేధింపుల కేసు విషయంలో ముఖ్యమంత్రి విజయ్, డీఎంకే అధినేత ఎం.కే. స్టాలిన్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "స్టాలిన్ గారూ, ఈ ఉదంతంపై మీ మౌనాన్ని వీడండి" అంటూ డిమాండ్ చేశారు.అక్టోబర్ 6న జరగనున్న ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న విజయ్, డీఎంకే ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. "2025 అక్టోబర్‌లో, డీఎంకే హయాంలోనే ఈ కేసుకు సంబంధించి ఫిర్యాదు అందినప్పటికీ, వారు నిందితులను రక్షించేందుకు వాస్తవాలను తారుమారు చేశారు. తగిన ఆధారాలు లేవనే సాకుతో కేసును మూసివేశారు" అని విజయ్ ఆరోపించారు. ఈ వ్యవహారంలో డీఎంకే, ఏఐఏడీఎంకే పరస్పరం సహకరించుకున్నాయని, అందుకే ఆ రెండు పార్టీలు నోరు మెదపడం లేదని విమర్శించారు. తన తల్లిని విమర్శించినా సహిస్తానని, కానీ తమిళనాడులోని మహిళా లోకాన్ని అవమానిస్తే ఊరుకోనని స్పష్టం చేశారు. డీఎంకే శ్రేణులు, వారి కుటుంబ సభ్యులు ఇటువంటి అనైతిక చర్యలను ప్రోత్సహిస్తున్నారని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు.

మైనర్ బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆరోపణలతో జెమ్ గ్రానైట్స్ చైర్మన్ ఆర్. వీరమణితో పాటు, ఆయనకు సహకరించిన శాంతి,

మహేంద్ర సింహన్‌లను 2026 ఆగస్టులో పోలీసులు అరెస్టు చేశారు. 2025లో ఓ సామాజిక కార్యకర్త విడుదల చేసిన వీడియో ఫుటేజ్‌తో ఈ ఉదంతం వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. అయితే, ప్రస్తుత టీవీకే ప్రభుత్వ హయాంలో ప్రత్యేక పోక్సో కోర్టు గతంలోని క్లోజర్ రిపోర్ట్‌ను తిరస్కరించి, పునర్విచారణకు ఆదేశించింది. ఈ క్రమంలో పోలీసులు బాధితులను గుర్తించి, వారి వాంగ్మూలాలను నమోదు చేశారు. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు కొనసాగుతుండగా, టీవీకే, డీఎంకే మధ్య ఇది ప్రధాన రాజకీయ పోరాటంగా మారింది.

# పెట్టుబడులే లక్ష్యంగా మంత్రి లోకేశ్ అహ్మదాబాద్ పర్యటన

- మొదటి పేజి తరువాయి

తయారీ వంటి కీలక రంగాల్లో ఏపీలో ఉన్న అవకాశాలను వారికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక విధానాలు, అందిస్తున్న ప్రోత్సాహకాలను తెలియజేసి, పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఆహ్వానించారు. లోకేశ్ ప్రతిపాదనలపై కంపెనీల ప్రతినిధులు సానుకూలంగా స్పందించి, వాటిని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.క్లీన్ ఎనర్జీలో ఏపీని ఎంచుకోండి: టొరెంట్ గ్రూప్‌తో లోకేశ్‌ఫార్మా, పవర్ రంగాల్లో అగ్రగామిగా ఉన్న టొరెంట్ గ్రూప్ చైర్మన్ సమీర్ మెహతా, ఇతర డైరక్టర్లతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. రాష్ట్రంలోని ఫార్మా క్లస్టర్లలో ఏపీఐ, ఇంటర్మీడియట్ తయారీ సామర్థ్యాన్ని విస్తరించాలని కోరారు. ముఖ్యంగా, పునరుత్పాదక ఇంధన రంగంలో టొరెంట్ గ్రూప్ ప్రణాళికలను ప్రస్తావిస్తూ.. సౌర, పవన, హైబ్రిడ్ ప్రాజెక్టులకు ఏపీ అనువైనదని తెలిపారు. పంప్డ్-స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్ వంటి క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు రాష్ట్రాన్ని గమ్యస్థానంగా ఎంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సమీర్ మెహతా స్పందిస్తూ.. 2030 నాటికి 10 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించడమే తమ లక్ష్యమని, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను తప్పక పరిశీలిస్తామని చెప్పారు.కాకినాడలో ఇండస్ట్రియల్ పార్క్: వెల్ స్పన్ గ్రూప్‌కు ప్రతిపాదనటెక్స్‌టైల్స్, మౌలిక సదుపాయాల రంగంలో ప్రసిద్ధిగాంచిన వెల్ స్పన్ వరల్డ్ గ్రూప్ సీఈఓ నితిన్ జైన్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. గతంలో దావోస్‌లో సీఎం చంద్రబాబుతో జరిగిన చర్చల పురోగతిని సమీక్షించారు. విశాఖపట్నంలో వెల్‌స్పన్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటు చేయాలని ఆహ్వానించారు. కాకినాడలో టెక్స్‌టైల్స్, లాజిస్టిక్స్, పైపుల తయారీ, గ్రీన్ అమ్మోనియా యూనిట్లతో కూడిన ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. నితిన్ జైన్ మాట్లాడుతూ.. ప్రస్తుతం కర్నూలు, కడపలో తమ సంస్థ 100 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టును నిర్వహిస్తోం దని, తాజా ప్రతిపాదనలను కూడా పరిశీలిస్తామని తెలిపారు.

**నెల్లూరులో ఆయిల్ రిఫైనరీలు: గోకుల్ ఆగ్రోతో చర్చలు**

వంట నూనెల తయారీలో పేరొందిన గోకుల్ ఆగ్రో రిసోర్సెస్ చైర్మన్ కనుభాయ్ ఠక్కర్‌తో లోకేశ్ భేటీ అయ్యారు. నెల్లూరు జిల్లా కృష్ణపట్నంలో ఇప్పటికే ఉన్న ప్లాంట్‌కు అదనంగా పామాయిల్, సోయాబీన్ ఆయిల్ రిఫైనరీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. దీనిపై కనుభాయ్ ఠక్కర్ స్పందిస్తూ.. కృష్ణపట్నంలో తమ ప్లాంట్ 2024 నుంచి ఉత్పత్తి ప్రారంభించిందని, దక్షిణాది మార్కెట్ల కోసం విస్తరణ ప్రణాళికలు ఉన్నాయని తెలిపారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనను పరిశీలనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**విశాఖలో టైర్ల తయారీ యూనిట్: చిరిపాల్ గ్రూప్‌కు ఆహ్వానం**

టెక్స్‌టైల్స్, కెమికల్స్ రంగాల్లోని చిరిపాల్ గ్రూప్ మేనేజింగ్ డైరక్టర్ బ్రిజ్ మోహన్ చిరిపాల్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. విశాఖపట్నం కనెక్టివిటీ, మౌలిక వసతులను వివరిస్తూ.. అక్కడ గ్రీన్‌ఫీల్డ్ టైర్ల తయారీ ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై బ్రిజ్ మోహన్ చిరిపాల్ స్పందిస్తూ.. ప్రస్తుతం తమకు పలు రాష్ట్రాల్లో తయారీ యూనిట్లు ఉన్నాయని, టైర్ల తయారీకి సంబంధించి ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనను పరిశీలిస్తామని అన్నారు.

**డేటా సెంటర్లలో పెట్టుబడులు పెట్టండి: ఎస్టీ టెలీమీడియాతో లోకేశ్**

డేటా సెంటర్ల దిగ్గజం ఎస్టీ టెలీమీడియా వైస్ ప్రెసిడెంట్ గౌతమ్ జెనాతో లోకేశ్ భేటీ అయ్యారు. విశాఖపట్నం డేటా సెంటర్ హబ్‌గా ఎదుగుతోందని, ఇప్పటికే గూగుల్, రిలయన్స్ వంటి సంస్థలు ముందుకు వచ్చాయని తెలిపారు. ఈ నేపథ్యంలో విశాఖలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. దీనిపై గౌతమ్ జెనా స్పందిస్తూ.. తమ సంస్థ కార్యకలాపాలను వివరించి, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనను పరిశీలిస్తామని చెప్పారు.

**విశాఖలో ప్రీ ఫ్యాబ్ కేంద్రం: ఈప్యాక్ గ్రూప్‌తో భేటీ**

ప్రీ ఫ్యాబ్ నిర్మాణ రంగంలో పేరొందిన ఈప్యాక్ గ్రూప్ చైర్మన్ భజరంగ్ బోత్రాతో లోకేశ్ సమావేశమయ్యారు. డేటా సెంటర్ల నిర్మాణానికి అవసరమైన ప్రీ ఫ్యాబ్ నిర్మాణ కేంద్రాన్ని విశాఖలో ఏర్పాటు చేయాలని కోరారు. భజరంగ్ బోత్రా మాట్లాడుతూ.. ఇప్పటికే శ్రీసిటీలో తమకు తయారీ యూనిట్లు ఉన్నాయని, విశాఖ ప్రతిపాదనను కూడా పరిశీలిస్తామని తెలిపారు.

**పైపుల తయారీ కేంద్రం ఏర్పాటు చేయండి: ఆస్ట్రల్ పైప్స్‌తో సమావేశం**

పైపుల తయారీలో అగ్రగామిగా ఉన్న ఆస్ట్రల్ పైప్స్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ అల్కేష్ పంచల్‌తో మంత్రి లోకేష్ చర్చలు జరిపారు. రాష్ట్రంలో నిర్మాణ రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్నందున, కాకినాడ లేదా అనకాపల్లిలో పైపుల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆహ్వానించారు. అల్కేష్ పంచల్ స్పందిస్తూ.. తమకు దేశవ్యాప్తంగా విస్తృత నెట్‌వర్క్ ఉందని, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు.

### మహిళలను పారిశ్రామికవేత్తలుగా
# తీర్చిదిద్దడమే లక్ష్యం

- మొదటి పేజి తరువాయి

సరస్ ప్రదర్శన' ఏర్పాట్లను రాష్ట్ర ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఉన్నతాధికారులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన మార్కెట్ సౌకర్యాన్ని కల్పించడమే ధ్యేయంగా నేషనల్ సరస్ మేళాను ఢిల్లీ నుంచి విజయవాడకు తీసుకువచ్చామని తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే మహిళా పారిశ్రామికవేత్తల కోసం 350కి పైగా స్టాళ్లను సిద్ధం చేస్తున్నామని, ఇందులో ఒక్క ఆంధ్రప్రదేశ్ నుంచే సుమారు 250 స్టాళ్లు ఉండబోతున్నాయని చెప్పారు. ఇతర రాష్ట్రాల విజయగాథలు, అనుభవాలను పంచుకునేలా ఈ మేళాను ఒక ప్రత్యేక 'లెర్నింగ్ సెంటర్'గా మలుస్తున్నామని పేర్కొన్నారు.అంతేకాకుండా, ఆంధ్రప్రదేశ్‌లో మహిళలు తయారు చేసే నాణ్యమైన ఉత్పత్తులకు గుర్తింపు కల్పించేందుకు 'స్వయం ఏపీ' అనే ప్రతిష్ఠాత్మక బ్రాండ్‌ను ప్రతిపాదించినట్లు వెల్లడించారు. దీని ద్వారా బ్రాండింగ్, ప్యాకేజింగ్, మార్కెటింగ్ అంశాల్లో మహిళలకు అవసరమైన పూర్తి సహకారాన్ని అందిస్తామన్నారు. దసరా ఉత్సవాల వేళ విజయవాడకు ఈ ఈవెంట్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని, సందర్శకుల సౌకర్యాలు, భద్రత మరియు పార్కింగ్ ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులతో విస్తృత సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు.

## ఏపీ హోంగార్డులకు శుభవార్త.. కానిస్టేబుల్ ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని హోంగార్డులకు ప్రభుత్వం శుభవార్త వినిపించింది. పోలీస్ శాఖలో స్టైపెండరీ కానిస్టేబుల్ (డ్రైవర్) పోస్టుల నియామకాల్లో వారికి 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గతంలో ఉన్న ప్రభుత్వ ఉత్తర్వులను (జీవో) సవరిస్తూ నూతన ఆదేశాలను జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయం సుదీర్ఘ కాలంగా ఎదురుచూస్తున్న హోంగార్డులకు పెద్ద ఊరటనిచ్చింది.పోలీస్ రవాణా సంస్థ (ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్) పరిధిలో 198 స్టైపెండరీ కానిస్టేబుల్ (డ్రైవర్) పోస్టుల భర్తీకి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ పోస్టుల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్ ఈ నెలలోనే విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ నియామక ప్రక్రియ నుంచే హోంగార్డులకు కేటాయించిన 10 శాతం రిజర్వేషన్ అమలులోకి రానుంది.నూతన రిజర్వేషన్ విధానం ద్వారా శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరాలనుకుంటున్న అర్హులైన హోంగార్డులకు మెరుగైన అవకాశాలు లభిస్తాయని అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల హోంగార్డుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

# సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కేకు.. ఢిల్లీ హైకోర్టు నోటీసులు

- మొదటి పేజి తరువాయి

రత్న సింగ్ లకు నోటీసులిచ్చింది. అనుమతి లేకుండా తన ఫొటోలు తీసి డిజిటల్ మార్ఫింగ్ చేశారని ఓ మహిళనుంచి ఇచ్చిన ఫిర్యాదుతో స్పందించిన కోర్టు ఈ చర్యలు తీసుకుంది. అక్టోబర్ 2న దేశవ్యాప్త నిరసనలకు సీజేపీ రెడీ అవుతున్న క్రమంలో హైకోర్టు నోటీసులు చర్చనీయాంశమయ్యాయి. తన అనుమతి లేకుండా ఫోటో తీసి, ఆ తర్వాత ఏఐ, ఫేస్-స్వాపింగ్ టూల్స్ ఉపయోగించి డిజిటల్‌గా మార్ఫింగ్ చేశారని ఓ మహిళ ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు ప్రకారం.. ప్రధాని మోదీతో కలిసి ఉన్న తన ఫోటోపై ఆమె ముఖాన్ని మార్ఫింగ్ చేశారని ఆరోపించింది. ఫిర్యాదులో సీజేపీ ప్రతినిధులు సౌరభ్ దాస్, అభిజీత్ దీప్కే, అశుతోష్ రాంకా, రత్న సింగ్‌లతో పాటు వారి సహచరులుగా ఆరోపించబడిన కొందరి పేర్లను పేర్కొంది.జంతర్ మంతర్ నిరసనల్లో మార్ఫింగ్ చేసిన తన ఫొటోలను ప్రచారం చేయడంతో తనకు బెదిరింపులు వస్తున్నాయని, తనకు రక్షణ కల్పించాలని కోరింది. ఈ కేసులో మహిళకు పూర్తి రక్షణ కల్పించాలని శుక్రవారం ఢిల్లీ హైకోర్టు పోలీసులను ఆదేశించింది. మహిళ భద్రతకోసం ఆమె అడ్రస్ సీక్రెట్ గా ఉంచాలని పోలీసులకు సూచించింది. దీంతోపాటు వెబ్ లింకులనుంచి , సోషల్ మీడియా ప్లాట్ ఫాంలనుంచి ఆమె ఫొటోలను తొలగించాలని మెటాకు ఆదేశించింది. ఈ కేసు ఢిల్లీ హైకోర్టులో ఉండగా, పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. సీఈసీ రాజీనామా చేయాలని అక్టోబర్ 2న సీజేపీ తలపెట్టిన దేశవ్యాప్త నిరసనలకు ముందు హైకోర్టు నోటీసులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది.

# శ్రీకాళహస్తిలో జనసేన బలోపేతానికి సమష్టి కృషి

## రాష్ట్ర కార్యదర్శి రామ్ తాళ్లూరిని కలిసిన శ్రీకాళహస్తి జనసేన నాయకులు





**శ్రీకాళహస్తి ,పెన్ పవర్, సెప్టెంబర్ 25:**
జనసేన పార్టీ అధిష్టానం పిలుపు మేరకు శ్రీకాళహస్తి నియోజకవర్గానికి చెందిన జనసేన నాయకులు మంగళగిరిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామ్ తాళ్లూరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ బలోపేతం, సంస్థాగత విస్తరణ, తాజా రాజకీయ పరిణామాలపై ఆయనతోచర్చించారు. శ్రీకాళహస్తినియోజకవర్గంలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేసేందుకు చేపడుతున్న కార్యక్రమాలను నాయకులు రాష్ట్ర కార్యదర్శికి వివరించారు. ఇటీవల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి జనసేన పార్టీలో చేరిన సుమారు 40 మంది నాయకులు, యువకుల చేరికతో పాటు, వివిధ రాజకీయ పార్టీల నుంచి మరిన్ని చేరికలు కొనసాగుతున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా రామ్ తాళ్లూరి మాట్లాడుతూ కొత్తగా పార్టీలో చేరుతున్న నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీని మరింత విస్తరించాలని సూచించారు. జనసేన పార్టీ సిద్ధాంతాలు, విలువలకు అనుగుణంగా ప్రతి ఒక్కరినీ కలుపుకొని ముందుకు సాగాలని, నాయకులుకార్యకర్తలు పరస్పర సమన్వయంతో ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, ప్రజా సమస్యలపై స్పందిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించినట్లు నాయకులు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం క్రమశిక్షణ, ఐక్యత, సమష్టి కృషి ఎంతో కీలకమని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా శ్రీకాళహస్తి జనసేన నాయకులు రాష్ట్ర కార్యదర్శి రామ్ తాళ్లూరికి నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులు, పార్టీ విస్తరణకు సంబంధించిన అంశాలను సమగ్రంగా వివరించారు. పార్టీ అధిష్టానం సూచనలకు అనుగుణంగా భవిష్యత్‌లో మరింత ఉత్సాహంతో పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కుమార్, మాధవ మహేష్, ఈర్ల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం.. ప్రతి అర్జీపై తక్షణ స్పందన







**క్యాంపు కార్యాలయంలో ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి**

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 25:**
శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టడమే లక్ష్యంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో 'ప్రజా గ్రీవెన్స్' కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు క్యాంపు కార్యాలయానికి చేరుకుని తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలను ఓపికగా విని, ఒక్కొక్కరి అర్జీని పరిశీలించారు. వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

"ప్రజల వద్దకే పాలన.. ప్రజల సమస్యలకే పరిష్కారం" అనే ధోరణితో పనిచేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలు తనపై నమ్మకంతో వచ్చి విన్నవించుకున్న ప్రతి సమస్యను బాధ్యతగా పరిగణించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కారం లభించేలా నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

ప్రజా సమస్యలను స్వయంగా విని, అధికారులతో సమన్వయం చేస్తూ పరిష్కారానికి చర్యలు చేపట్టడం పట్ల పలువురు ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని బొజ్జల సుధీర్ రెడ్డి స్పష్టం చేశారు.

# పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేనలో చేరిన శ్రీకాళహస్తి పట్టణ ప్రముఖులు

**జనసేనలో చేరిన సత్రవాడ ప్రవీణ్, మిద్దెల హరీ**



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 25:**
జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సమక్షంలో శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన ప్రముఖులు సత్రవాడ ప్రవీణ్, మిద్దెల హరీ జనసేన పార్టీలో చేరారు. పార్టీ సిద్ధాంతాలు, అధినేత పవన్ కళ్యాణ్ నాయకత్వంపై విశ్వాసంతో పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ వారికి జనసేన పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ప్రజా సమస్యల పరిష్కారం, సమాజ సేవ, యువతకు ప్రాధాన్యత వంటి అంశాలతో ముందుకు సాగుతున్న జనసేనలో తాము భాగస్వాములు కావడం ఆనందంగా ఉందని సత్రవాడ ప్రవీణ్, మిద్దెల హరీ పేర్కొన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలో ప్రజలతో సత్సంబంధాలు కలిగిన వీరి చేరికతో జనసేన పార్టీకి మరింత బలం చేకూరుతుందని పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని వారు తెలిపారు. పార్టీలో నూతనంగా చేరిన సత్రవాడ ప్రవీణ్, మిద్దెల హరీలను జనసేన నాయకులు, కార్యకర్తలు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. వారి సేవా దృక్పథం, ప్రజలతో ఉన్న అనుబంధం పార్టీకి మరింత ఉపయోగకరంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జనసేన కుటుంబంలోకి నూతనంగా చేరిన వీరికి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలుకుతూ, ప్రజాసేవలో మరింత చురుగ్గా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# శ్రీకాళహస్తికి సింగపూర్ సీనియర్ మినిస్టర్ విశ్వనాథన్ షణ్ముఖం

**ఎంజీఎం గ్రూప్ కుటుంబం ఘన స్వాగతం.. పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్న షణ్ముఖం**





**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 25:**
శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దర్శనార్థం శ్రీకాళహస్తికి విచ్చేసిన సింగపూర్ సీనియర్ మినిస్టర్ శ్రీ విశ్వనాథన్ షణ్ముఖంకు శ్రీకాళహస్తి ఎంజీఎం గ్రూప్ కుటుంబం ఘన స్వాగతం పలికింది. శుక్రవారం శ్రీకాళహస్తి ఎంజీఎం హాస్పిటల్ హెలిప్యాడ్‌కు చేరుకున్న ఆయనకు ఎంజీఎం గ్రూప్ చైర్మన్ శ్రీ గుడ్లూరు మల్లికార్జున నాయుడు, ఎంజీఎం గ్రూప్ డైరెక్టర్ మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ డాక్టర్ గుడ్లూరు మయూర్, ఆయన సతీమణి శ్రీమతి ఐశ్వర్య లక్ష్మి సాదరంగా స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా మంత్రివర్యుడు గతంలో 2014, 2015 సంవత్సరాల్లో శ్రీకాళహస్తి పర్యటనకు వచ్చిన సందర్భాలను ఎంజీఎం గ్రూప్ చైర్మన్ గుడ్లూరు మల్లికార్జున నాయుడు గుర్తుచేశారు. ముఖ్యంగా అప్పట్లో ఎంజీఎం స్కూల్ విద్యార్థులతో శ్రీ విశ్వనాథన్ షణ్ముఖం నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమానికి సంబంధించిన పాత జ్ఞాపకాలను ఫొటోల రూపంలో ఆయనకు అందజేశారు. పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్న షణ్ముఖం ఆత్మీయంగా స్పందించినట్లు తెలిపారు.

**రుద్రాక్ష మాలతో ప్రత్యేక సత్కారం**
శ్రీకాళహస్తి ఎంజీఎం హోటల్‌లో పండించిన రుద్రాక్షలతో ప్రత్యేకంగా తయారు చేసిన రుద్రాక్ష మాలను శ్రీ విశ్వనాథన్ షణ్ముఖంకు ఎంజీఎం గ్రూప్ తరఫున అందజేశారు. ఆధ్యాత్మిక నగరమైన శ్రీకాళహస్తి విశిష్టతను ప్రతిబింబించేలా రుద్రాక్ష మాలను అందించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. డాక్టర్ గుడ్లూరు మయూర్, శ్రీమతి ఐశ్వర్య లక్ష్మి పుష్పగుచ్ఛాలు అందించి మంత్రికి ఘన స్వాగతం పలికారు.

**శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దర్శనం**
అనంతరం సింగపూర్ సీనియర్ మినిస్టర్ శ్రీ విశ్వనాథన్ షణ్ముఖం శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్వామివారి దర్శనం అనంతరం ఎంజీఎం హాస్పిటల్‌ను సందర్శించి అక్కడ అందుబాటులో ఉన్న వైద్య సేవలు, మౌలిక సదుపాయాలు, ఆసుపత్రి నిర్వహణ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన పర్యటన సందర్భంగా ఎంజీఎం గ్రూప్ కుటుంబ సభ్యులు ఆత్మీయత, ఆతిథ్యంతో స్వాగతం పలకడం విశేషంగా నిలిచింది. పర్యటన ముగించుకుని హెలిప్యాడ్ నుంచి బయలుదేరుతున్న సమయంలో ఎంజీఎం గ్రూప్ తరఫున ఆయనకు సాదర వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో సింగపూర్ సీనియర్ మినిస్టర్ శ్రీ విశ్వనాథన్ షణ్ముఖం, ఎంజీఎం గ్రూప్ చైర్మన్ శ్రీ గుడ్లూరు మల్లికార్జున నాయుడు, ఎంజీఎం గ్రూప్ డైరెక్టర్ మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ డాక్టర్ గుడ్లూరు మయూర్, ఆయన సతీమణి శ్రీమతి ఐశ్వర్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రథమ నంది దేవస్థానం బ్రిడ్జి పునరుద్ధరణ పనులకు మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆదేశం

**కూలిన బ్రిడ్జికి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు నూతన బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు ఆమోదం**



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 25**
నంద్యాలలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ ప్రథమ నంది దేవస్థానం వద్ద కూలిపోయిన బ్రిడ్జి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి. ఫరూక్ స్పష్టం చేశారు.

గత వారంలో కురిసిన వర్షాల ప్రభావంతో ప్రథమ నంది దేవస్థానం వద్ద ఉన్న వంతెన (బ్రిడ్జి) ఒకవైపు కూలిపోవడంతో భక్తులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను దేవస్థానం చైర్మన్ చలం బాబు మంత్రి ఫరూక్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన మంత్రి, గతంలోనే అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో బ్రిడ్జి ప్రాంగణాన్ని పరిశీలించారు.

ఈ క్రమంలో కూలిపోయిన వంతెనకు తక్షణమే అవసరమైన మరమ్మతు పనులను చేపట్టడంతో పాటు, రాబోయే రోజుల్లో భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా నూతన బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలకు నిధులు మంజూరు చేయించడం జరిగిందని మంత్రి ఫరూక్ తెలిపారు.

అలాగే ప్రథమ నంది దేవస్థానం ఉత్తరం వైపు ఉన్న మాడవీధి ప్రాంగణంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో నిర్మించతలపెట్టిన శ్రీవారి ఆలయ స్థలాన్ని కూడా మంత్రి ఫరూక్ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఆలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యార్థం అన్ని విధాలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు

ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ చలం బాబు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ప్రియాంక, ఆర్డీవో విశ్వనాథ్, మున్సిపల్ కమిషనర్ శేషన్న, ఎమ్మార్వో శ్రీనివాసులు, నంద్యాల టిడిపి మండల కన్వీనర్ మునగాల విశ్వనాథరెడ్డి, చంద్రారెడ్డి, పబ్బతి వేణు, తాటికొండ బుగ్గ రాముడు , మహేష్ మరియు సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి । చిత్తూరు । వై.ఎస్.ఆర్. కడప

# వైఎస్ అంజలి రెడ్డి నిశ్చితార్థ వేడుకల్లో కాంగ్రెస్ నేతలు

## నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపిన బాలగురవం బాబు, తలపా దామోదరం రెడ్డి





**శ్రీకాళహస్తి ,పెన్ పవర్, సెప్టెంబర్ 25:**
వైఎస్ షర్మిలా రెడ్డి కుమార్తె వైఎస్ అంజలి రెడ్డి నిశ్చితార్థ వేడుకలు హైదరాబాద్‌లోని రంగారెడ్డి జిల్లా కోత్వలగూడలో గల ఆనంద కన్వెన్షన్‌లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, రాజకీయ ప్రముఖులు, అభిమానులు హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ శుభకార్యానికి తిరుపతి జిల్లా డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు, శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సౌభాగ్యాలతో నిండాలని ఆకాంక్షించారు.

వైఎస్ కుటుంబంతో తమకు ఉన్న సాన్నిహిత్యాన్ని చాటుకుంటూ కాంగ్రెస్ నాయకులు ఈ శుభవేడుకలో పాల్గొని కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు. వేడుకలో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొనగా, పలువురు ప్రముఖులు నూతన జంటకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# శ్రీకాళహస్తి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ మహాసభ ఘనంగా

## బ్యాంకు అభివృద్ధికి పాలకవర్గం చేస్తున్న కృషి అభినందనీయం: ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి







**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 25:**
శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీ సరస్వతి ఆడిటోరియంలో శ్రీకాళహస్తి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ 105వ వార్షిక సర్వసభ్య సమావేశం శుక్రవారం ఘనంగా నిర్వహించారు.

ఈ సమావేశానికి శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు.

బ్యాంకు అభివృద్ధి పథంలో పయనం

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ..**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం నూతనంగా నియమితులైన టౌన్ బ్యాంక్ చైర్మన్, పాలకవర్గం ఆధ్వర్యంలో బ్యాంకు ప్రగతి పథంలో ముందుకు సాగడం అభినందనీయమన్నారు. తక్కువ వ్యవధిలోనే పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ఖాతాదారులు, వాటాదారుల ప్రయోజనాలకు అనుగుణంగా ప్రజానుకూల నిర్ణయాలు తీసుకోవడం ప్రశంసనీయమని పేర్కొన్నారు.

సహకార రంగానికి ప్రభుత్వం అండగా ఉంటుందిసహకార రంగం బలోపేతానికి కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. టౌన్ బ్యాంక్ భవిష్యత్ అభివృద్ధి, విస్తరణకు అవసరమైన సహాయ సహకారాలను అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. బ్యాంకును మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు శ్రమిస్తున్న పాలకమండలి సభ్యులు, సిబ్బంది, ఖాతాదారులు,షేర్‌హోల్డర్లకు ఆయనహృదయపూర్వక అభినందనలు, శభాకాంక్షలు తెలియజేశారు.

వార్షిక నివేదిక, ఆడిట్ నివేదికలకు ఆమోదంసర్వసభ్య సమావేశంలో బ్యాంకు 105వ వార్షిక నివేదికతో పాటు ఆడిట్ నివేదికలను సభ్యులు పరిశీలించి ఆమోదించారు. అలాగే 202526 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లాభాల పంపకం, డివిడెండ్ పంపిణీ, 202627 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ అంచనాలు, బ్యాంకు అభివృద్ధి, భవిష్యత్ విస్తరణకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించి ఆమోదం తెలిపారు. కోరం పూర్తితో విజయవంతంగా మహాసభసభకు అవసరమైన కోరం పూర్తిగా హాజరైనందున వార్షిక సర్వసభ్య సమావేశం విజయవంతంగా నిర్వహించినట్లు బ్యాంక్ చైర్మన్ ఎస్. ఖాదర్‌బాషా తెలిపారు. బ్యాంకు అభివృద్ధికి సభ్యులు, ఖాతాదారులు, వాటాదారులు అందిస్తున్న సహకారం మరింత కొనసాగించాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ లిమిటెడ్ సీఈవో ధనంజయులు, చైర్మన్ ఎస్. ఖాదర్‌బాషా, వైస్ చైర్మన్ ఎన్. గోవర్ధన్, డైరెక్టర్లు మురళి, దొరబాబు, బాబు ఆర్ముగం, రాంబాబు, అనిల్ కుమార్, కవిత తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ ఛాంపియన్లకు మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఘన సన్మానం

**- సీనియర్ మెన్స్ విభాగంలో స్వర్ణ పతకం సాధించిన నంద్యాల జిల్లా జట్టు**
**- క్రీడల్లో రాణించి జిల్లాకు మరింత గుర్తింపు తేవాలని మంత్రి ఫరూక్ ఆకాంక్ష**



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 25**
రాష్ట్ర స్థాయి సీనియర్ బేస్‌బాల్ (పురుషుల) పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని, బంగారు పతకాన్ని సాధించిన నంద్యాల జిల్లా జట్టు సభ్యులను నంద్యాల మంత్రి క్యాంప్ కార్యాలయం నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఘనంగా అభినందించారు.

ఈ సందర్భంగా విజేతలైన క్రీడాకారులను మంత్రి ఫరూక్ శాలువా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాల యువత క్రీడల్లో రాణించి రాష్ట్ర స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించడం జిల్లాకే గర్వకారణమని అన్నారు. క్రీడాకారులు నిరంతర సాధనతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ వారికి తన ఆశీస్సులు అందజేశారు. క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్ఏపీఈ అధ్యక్షులు నిమ్మకాయల సుధాకర్, జిల్లా బేస్‌బాల్ సలహాదారు చలం బాబు , జిల్లాల బేస్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శులు సుబ్బయ్య, రమణయ్య, నంద్యాల జిల్లా వైస్ ప్రెసిడెంట్ నరేష్ నాయుడు, మాజీ కౌన్సిలర్ కండే శ్యామ్ సుందర్ లాల్ తో పాటు ఇతర నాయకులు, క్రీడా ప్రముఖులు పాల్గొన్నారు.

# సీఎంఆర్‌ఎఫ్‌తో బాధిత కుటుంబాలకు భరోసా.. ఎమ్మెల్యే డా.పాశిం సునీల్ కుమార్





**గూడూరు, పెన్ పవర్, సెప్టెంబర్,25:**
ముఖ్యమంత్రి సహాయ నిధి 29వ విడతలో భాగంగా గూడూరు నియోజకవర్గానికి చెందిన 122 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.58,04,837 విలువైన చెక్కులను గూడూరు ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాశిం సునీల్ కుమార్ క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో గూడూరు నియోజకవర్గంలో 1,232 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.8.19 కోట్లకు పైగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు చికిత్స ఖర్చుల కోసం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు.

సహాయం పొందిన లబ్ధిదారులు మాట్లాడుతూ, చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో సీఎంఆర్‌ఎఫ్ ద్వారా సహాయం అందించిన ఎమ్మెల్యే సునీల్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

## తాతయ్య జ్ఞాపకార్థం సేవా కార్యక్రమం చేపట్టిన యువ సమాజ్ నిర్మాణ్ సభ్యులు




**ఏర్పేడు, పెన్ పవర్, సెప్టెంబర్ 25:**
వర్ధంతి సందర్భంగా తాతయ్య జ్ఞాపకార్థం విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేసి సేవా స్ఫూర్తిని చాటుకున్నారు. ఏర్పేడు మండలం కిష్టంపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో యువ సమాజ్ నిర్మాణ్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యుడు కిరణ్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు పుస్తకాలు, ఇతర అవసరమైన విద్యా సామగ్రిని పంపిణీ చేశారు.
తన తాత ఆర్కురు శంకరయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఆయన జ్ఞాపకార్థంగా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కిరణ్ తెలిపారు. విద్యార్థుల చదువుకు ఉపయోగపడే విధంగా అవసరమైన సామగ్రిని అందించడం ద్వారా శంకరయ్య జ్ఞాపకాలను సార్థకం చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు.
ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులకు అండగా నిలుస్తూ ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు.
ఈ కార్యక్రమంలో యువ సమాజ్ నిర్మాణ్ స్వచ్ఛంద సేవా సంస్థ కిష్టంపల్లి అధ్యక్షులు కిరణ్, అరుణాచలం, సంస్థ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆశయ సాధనకు కృషి చేయాలి

## అంత్యోదయ సిద్ధాంతమే దేశ అభివృద్ధికి దిక్సూచి: జి.వి. అమర్‌నాథ్



**తొట్టంబేడు, పెన్ పవర్, సెప్టెంబర్ 25:**
తొట్టంబేడు మండలం కొత్తకండ్రిగ గ్రామంలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ 110వ జయంతి వేడుకలను మండల బీజేపీ అధ్యక్షుడు వెడాం కిష్టయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. బీజేపీ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.వి. అమర్‌నాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.
ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ, దేశం, సమాజం, పార్టీ కోసం దీన్ దయాళ్ ఉపాధ్యాయ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన ప్రతిపాదించిన 'ఏకాత్మ మానవతావాదం', 'అంత్యోదయ' సిద్ధాంతాలు నేటికీ మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. సమాజంలోని చిట్టచివరి వ్యక్తికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడమే అంత్యోదయ లక్ష్యమని, పేదలు, బడుగు వర్గాల అభివృద్ధితోనే దేశ ప్రగతి సాధ్యమని తెలిపారు.
ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని చెప్పారు. కార్యకర్తలు ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, అర్హులందరికీ ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.
దీన్ దయాళ్ ఉపాధ్యాయ భారతీయ సంస్కృతి, సామాజిక విలువల ఆధారంగా ఏకాత్మ మానవతావాదాన్ని ప్రతిపాదించారని నాయకులు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శివారెడ్డి, రత్నం రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, బాలాజీ రెడ్డి తదితరులు పాల్గొని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ప్రతిజ్ఞ చేశారు.

# నులిపురుగుల నిర్మూలనతోనే ఆరోగ్యవంతమైన బాల్యం



**విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేతుల పరిశుభ్రతపై అవగాహన**
**వ్యక్తిగత పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం : ప్రగతి సంస్థ కోఆర్డినేటర్ చంద్రశేఖర్**



**శ్రీకాళహస్తి రూరల్ , పెన్ పవర్, సెప్టెంబర్ 25:**
జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ముచ్చువోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మంగళగిరి ప్రాథమిక పాఠశాల, దొడ్లమిట్ట అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణపై అవగాహనకార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసి, నులిపురుగుల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్ పిలుపునిచ్చారు.
ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పిల్లలు ప్రతిరోజూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, శుభ్రమైన దుస్తులు ధరించాలని సూచించారు. ముఖ్యంగా భోజనానికి ముందు, తర్వాత సబ్బుతో చేతులను శుభ్రంగా కడుక్కోవడం అలవాటుగా చేసుకోవాలని తెలిపారు. చేతి గోళ్లు పెరగకుండా ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలని, పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు.
ప్రగతి సంస్థ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ "పిల్లల ఆరోగ్యానికి చేతుల పరిశుభ్రత ఎంతో కీలకం. ప్రతిరోజూ స్నానం చేయడంతో పాటు భోజనానికి ముందు, తర్వాత తప్పనిసరిగా చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి" అని సూచించారు. చేతులు కడుక్కునే సరైన విధానాన్ని విద్యార్థులకు డెమో ద్వారా వివరించారు. సబ్బుతో అరచేతులు, చేతి వెనుక భాగం, వేళ్ల మధ్య భాగాలను శుభ్రంగా రుద్ది, అనంతరం నీటితో కడిగి శుభ్రమైన టవల్‌తో తుడుచుకోవాలని చూపించారు. అనంతరం భోజనం తర్వాత విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.
నులిపురుగుల నివారణతో పిల్లల్లో ఆరోగ్యం, పోషకాహార గ్రహణం, ఎదుగుదల మెరుగుపడుతుందని,
అందువల్ల తల్లిదండ్రులు కూడా పిల్లల వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలనికార్యక్రమంలోసూచించారు. పిల్లల్లో చిన్ననాటి నుంచే పరిశుభ్రతపై అవగాహనపెంపొందించడం ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి బలమైన పునాది అని నిర్వాహకులు పేర్కొన్నారు. విద్యార్థులు ఆరోగ్య నియమాలను పాటిస్తూ, ఇతరులకు కూడా పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేష్, ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, శర్మ, నాగరాజు, నిర్మలకుమారి, విద్యార్థులు, ఏఎన్ఎం వాణిశ్రీ, ఆశా వర్కర్లు మునెమ్మ, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం.




**పెన్ పవర్ రొంపిచర్ల మండలం సెప్టెంబర్ 25**
రొంపిచర్ల మండలం రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారీ డా . దినేష్ కుమార్ నాయక్ ఈరోజు రొంపిచర్ల మండలం లో వున్న అంగన్వాడీ కేంద్రాలు, స్కూల్లో ఉన్న పిల్లలందరికీ జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం. సందర్భం . 1సం. నిండిన పిల్లలనుండి 19 సం. వయసు పిల్లలందరికీ కు ఆల్బెండజోల్ మాత్రలను వేసా రూ . ఈ రోజు వేసుకొని ( ఆబ్సెంట్ ) పిల్లలకు, అక్టోబర్ 5 వ తేదీన వేస్తారు, ఈ మాత్రల లను పిల్లలు వేసుకోవటం వల్ల కడుపులో ఉన్న నులి పురుగులు చనిపోతాయి, దీని వల్ల పిల్లలు తీసుకున్న పోషకహారం లోని పోషకాలు అందుతాయి మరియు రక్త హీనత కలగకుండా కాపాడవచ్చు.
ప్రతి ఆరునెలకు ఒక సారి ఈ మాత్రలను 1సం. నుండి 19 సం. వయసున్న పిల్లలకు అందజేస్తారు. మండలంలోని స్కూల్స్ లో వున్న మొత్తం పిల్లల సంఖ్య 3965 మంది పిల్లలకు గాను ఈరోజు 3914 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను వేసారు 98.71 శాతం కవర్ చేయడం జరిగింది ఈరోజు స్కూల్ కు హాజరు కాని 51 మంది పిల్లలకు అక్టోబర్ 5వ తేదీన వేయటం జరుగుతుంది . ఈ కార్యక్రమంలో రాజేశ్వరి మండల ఆరోగ్య విద్యాధికారి, పంకజ హెల్త్ సూపర్వైజర్ మరియు ఆరోగ్య కార్యకర్తలు హాజరైనారు

# ఘనంగా వందేమాతరం 150 సంవత్సరాల వేడుకలు



**దేశభక్తి స్ఫూర్తిని చాటిన విద్యార్థులు.. యువత దేశ సేవలో ముందుండాలి**
**స్వాతంత్ర్య ఉద్యమంలో వందేమాతరం గేయం కీలక పాత్ర: వక్తలు**




**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 25:**
శ్రీకాళహస్తి పట్టణంలోని ముత్యాలమ్మ గుడి వీధిలో ఉన్న శ్రీ సరస్వతి శిశు మందిర్లో వందేమాతరం గేయానికి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. దేశభక్తి, జాతీయ స్ఫూర్తిని చాటుతూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, పాఠశాల పోషకులు, మాతాజీలు, వివిధ కళాశాలల విద్యార్థులు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
కార్యక్రమానికి శ్రీ చాగన భక్తవత్సల అయ్య అధ్యక్షత వహించగా, శ్రీకాళహస్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. వెంకటేశ్వర్లు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి. దామోదర్ నాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముఖ్య వక్తగా వ్యవసాయ అధికారి సూర్య ప్రకాష్ రెడ్డి పాల్గొని వందేమాతరం గేయం ప్రాముఖ్యతను వివరించారు.
సూర్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాట కాలంలో వందేమాతరం గేయం దేశ ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని, దేశభక్తి భావాన్ని రగిలించి, స్వాతంత్ర్య సమరంలో ప్రజలను చురుగ్గా పాల్గొనేలా ప్రేరేపించిందని తెలిపారు. బంకించంద్ర చటర్జీ రచించిన ఈ గేయం స్వాతంత్ర్య సమరయోధుల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందన్నారు.
దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడారని, వారి త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛగా జీవిస్తున్నామని పేర్కొన్నారు. 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కూడా వందేమాతరం గేయాన్ని ఆలపించడం ప్రతి భారతీయుడికి గర్వకారణమని అన్నారు.
ప్రస్తుత యువతలో దేశభక్తి, సేవాభావం మరింత పెంపొందాల్సిన అవసరం ఉందని, దేశ సేవతో పాటు దేశ రక్షణ బాధ్యతలోనూ యువత ముందుండాలని పిలుపునిచ్చారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, దేశభక్తి, సామాజిక బాధ్యత వంటి విలువలను అలవర్చుకోవాలని సూచించారు.
ఈ సందర్భంగా వందేమాతరం గేయాన్ని ఆలపిస్తూ దేశభక్తి స్ఫూర్తిని చాటారు. కార్యక్రమంలో పాఠశాల ప్రబంధకార్యవర్గ సభ్యులు, పూర్వ విద్యార్థులు, వివిధ కళాశాలల విద్యార్థులు, పాఠశాల పోషకులు, మాతాజీలు, విద్యార్థులు, శ్రీకాళహస్తి పట్టణ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# తొట్టంబేడు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

**- ఉపాధి హామీ పనిదినాలను 200 రోజులకు పెంచాలి**
**- కూలీలకు రోజుకు రూ.600 వేతనం చెల్లించాలి : వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్**





**తొట్టంబేడు, పెన్ పవర్, సెప్టెంబర్ 25:**
తొట్టంబేడు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, గ్రామీణ ప్రాంత ప్రజలకు తక్షణమే ఉపశమన చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు తొట్టంబేడు మేజర్ పంచాయతీ గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు.
సంఘం నాయకులు రుద్రపాకు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా నాయకులు జె. తులసిరాజన్, మించల శివకుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో నెలకొన్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తొట్టంబేడు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని కోరారు.
మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిదినాలను 200 రోజులకు పెంచడంతో పాటు, కూలీలకు రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. జాబ్ కార్డులతో సంబంధం లేకుండా అర్హులైన గ్రామీణ కూలీలందరికీ ఉపాధి కల్పించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు లేక యువత వలస బాట పట్టకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.
అదేవిధంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల ఇంటి స్థలాలు నిరుపేదలకు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇంటి స్థలాలు లేని పేదలను గుర్తించి వెంటనే స్థలాలు కేటాయించాలని కోరారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో నిరుపేదలను సమీకరించి మరింత ఉధృతంగా పోరాటాలు చేపడతామని నాయకులు హెచ్చరించారు.
ఎల్ఐసీ కాలనీ వాసుల స్మశానవాటిక సమస్యను కూడా పరిష్కరించాలని, స్మశాన స్థలాన్ని సర్వే చేసి హద్దులు నిర్ధారించి ప్రజలకు స్పష్టత కల్పించాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పంచాయతీ కార్యదర్శి జ్ఞాన ప్రకాష్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో పరశురామయ్య, మల్లేశ్వరమ్మ, వినాయక తదితరులు పాల్గొన్నారు.

# భక్తి భావంతో ప్రసాదం.. నాణ్యతలో రాజీ లేదు!





**- స్వామివారి ప్రసాదం పవిత్రతకు ప్రతీక.. భక్తుల సంతృప్తే దేవస్థానం లక్ష్యం**
**- ప్రసాదం పోటులో ఆకస్మిక తనిఖీ నిర్వహించిన చైర్మన్ సాయి ప్రసాద్**



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 25:**
శ్రీకాళహస్తీశ్వరస్వామివారి దేవస్థానంలో భక్తులకు అందించే ప్రసాదం నాణ్యత, రుచి, పరిశుభ్రత విషయంలో ఎలాంటి రాజీకి తావులేకుండా చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం దేవస్థానం ప్రసాదం పోటులో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.
ఈ సందర్భంగా ప్రసాదాల తయారీ ప్రక్రియ, వినియోగిస్తున్న ముడి పదార్థాల నాణ్యత, వంటశాల పరిశుభ్రత, సిబ్బంది పాటిస్తున్న పరిశుభ్రత ప్రమాణాలు, ప్రసాదాల ప్యాకింగ్, భక్తులకు పంపిణీ చేసే విధానాన్ని పరిశీలించారు. ప్రసాదం తయారీలో నాణ్యమైన పదార్థాలను మాత్రమే వినియోగించాలని, వంటశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు.
"స్వామివారి ప్రసాదం భక్తులకు కేవలం ఆహారం కాదు.. అది పవిత్రమైన ప్రసాదం" అనే భావనతో ప్రతి దశలోనూ నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని దేవస్థానం చైర్మన్ శ్రీ సాయి ప్రసాద్ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భక్తులు స్వామివారి దర్శనంతో పాటు ఎంతో భక్తిశ్రద్ధలతో స్వీకరించే ప్రసాదంలో నాణ్యత లోపాలకు ఎలాంటి అవకాశం ఇవ్వకూడదని పేర్కొన్నారు.
ప్రసాదం రుచి, నాణ్యత, పరిశుభ్రత విషయంలో భక్తుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, తయారీ నుంచి పంపిణీ వరకు ప్రతి దశను అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. అదేవిధంగా భక్తులకు ప్రసాదం అందించే సమయంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.
భక్తుల విశ్వాసాన్ని కాపాడుతూ.. వారి సంతృప్తికి ప్రాధాన్యతనిస్తూ దేవస్థాన సేవలను మరింత మెరుగుపరచడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చైర్మన్ సాయి ప్రసాద్ తెలిపారు. దేవస్థానం అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు.
స్వామివారి ప్రసాదం పవిత్రతను, నాణ్యతను కాపాడేందుకు చేపట్టిన ఈ ఆకస్మిక తనిఖీ భక్తుల పట్ల దేవస్థానం చూపుతున్న బాధ్యతాయుతమైన వైఖరికి నిదర్శనంగా నిలిచింది.

# నులిపురుగుల నివారణతోనే ఆరోగ్యకరమైన భవిష్యత్తు

## విద్యార్థులు పరిశుభ్రతను పాటించాలి.. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.బి. వాణిశ్రీ




**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 25:**
నులిపురుగుల వ్యాప్తిని అరికట్టి విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్.వి.ఏ. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.బి. వాణిశ్రీ సూచించారు. నులిపురుగుల కారణంగా కడుపునొప్పి, ఆకలి తగ్గడం, బలహీనత తదితర ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, వాటి నివారణకు ముందస్తు జాగ్రత్తలు ఎంతో అవసరమని తెలిపారు.
శుక్రవారం శ్రీకాళహస్తిలోని ఎస్.వి.ఏ. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జువాలజీ విభాగం, రెడ్ రిబ్బన్ క్లబ్, యూత్ రెడ్ క్రాస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.బి. వాణిశ్రీ మాట్లాడుతూ.. పిల్లలు, యువత ఆరోగ్యంగా ఎదగడానికి నులిపురుగుల నియంత్రణ ఎంతో కీలకమన్నారు. నులిపురుగుల నివారణ ద్వారా తీసుకునే ఆహారంలోని పోషకాలు శరీరానికి సమర్థవంతంగా అందుతాయని, తద్వారా శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు.
పరిశుభ్రతే నులిపురుగుల నివారణకు ప్రధాన ఆయుధమని పేర్కొంటూ, విద్యార్థులు సబ్బుతో చేతులను శుభ్రంగా కడుక్కోవడం, గోళ్లను ఎప్పటికప్పుడు శుభ్రంగాఉంచుకోవడం, శుభ్రమైన నీటినివినియోగించడం, బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా చెప్పులు ధరించడం వంటి మంచి అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటిస్తే నులిపురుగుల వ్యాప్తిని గణనీయంగా అరికట్టవచ్చని తెలిపారు.
అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.బి. వాణిశ్రీ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. విద్యార్థులు ఆరోగ్యంపై అవగాహన పెంచుకుని, ఇతరులకు కూడా పరిశుభ్రత ప్రాధాన్యతను తెలియజేయాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ మన్యం నరసింహులు, డాక్టర్ టి. గంగారం, డాక్టర్ తులసి తదితర అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# మాట ఇస్తే మరువము.. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటాము!



**అక్కుర్తి ప్రభుత్వ పాఠశాలకు కార్పొరేట్ హంగులు.. విద్యార్థులకు ఆధునిక వసతులు అంకితం**

**శ్రీకాళహస్తి రూరల్, పెన్ పవర్, సెప్టెంబర్ 25:**
ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతూ.. శ్రీకాళహస్తి మండలం అక్కుర్తి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ స్థాయి హంగులు, ఆధునిక వసతులతో పునరుద్ధరించి విద్యార్థులకు అంకితం చేశారు.

గతంలో ఇచ్చిన హామీ మేరకు అనుకున్న సమయం కంటే ముందుగానే పాఠశాల అభివృద్ధి పనులను పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడం పట్ల నిర్వాహకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటైన వాతావరణం కల్పించాలనే లక్ష్యంతో తరగతి గదులను ఆధునికంగా తీర్చిదిద్దారు.



కార్యకర్తల సహకారంతో పాటు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (జూ=) నిధులను వినియోగించి పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు ఆహ్లాదకరమైన, సౌకర్యవంతమైన విద్యా వాతావరణం కల్పించడంతో వారి చదువుపై మరింత ఆసక్తి పెరుగుతుందని పేర్కొన్నారు.

**15 రోజుల్లో స్పోర్ట్స్ గ్రౌండ్, క్రీడా సామగ్రి**

విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత కల్పించాలనే ఉద్దేశంతో రాబోయే 15 రోజుల్లో స్పోర్ట్స్ ఎక్విప్‌మెంట్‌తో పాటు స్పోర్ట్స్ గ్రౌండ్‌ను కూడా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు.ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు.. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆధునిక వసతులు అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.





మన బడి.. మన పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది అనే సంకల్పంతో చేపడుతున్న ఈ అభివృద్ధి కార్యక్రమాలు అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారువిద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అండగా నిలవడం ఆదర్శప్రాయమని పలువురు అభినందించారు.

# అంగన్వాడి అభివృద్ధికి కమ్యూనిటీ భాగస్వామ్యం ఎంతో అవసరం.

**పెన్ పవర్ రొంపిచర్ల మండలం సెప్టెంబర్ 25**
పోషణ మాసోత్సవంలో భాగంగా పులిచెర్ల ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని రొంపిచర్ల మండలం పెద్దగొట్టిగల్లు పంచాయితీలోని కొండా రెడ్డి గారి పల్లి అంగన్వాడీ కేంద్రంలో ఈరోజు పోషణ మాసోత్సవం
కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పులిచెర్ల ఐసిడిఎస్ సిడిపిఓ వాణిశ్రీదేవి మాట్లాడుతూ అంగన్వాడీ అభివృద్ధికి కమ్యూనిటీ భాగస్వామ్యం ఎంతో అవసరమని తెలియజేశారు అంగన్వాడీలో అందించే సేవలు అన్నింటిని కూడా లబ్ధిదారులందరూ వినియోగించుకోవాలని తెలియజేశారు అలాగే ప్రతి అంగన్వాడీ కేంద్రంలో కూడా అంగన్వాడి మేనేజ్మెంట్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు ఈ కమిటీలో ఉన్న సభ్యులందరూ కూడా తరచూ అంగన్వాడి కేంద్రాన్ని సందర్శిస్తూ అక్కడ అందించే సేవలు అన్నింటిని కూడా పరిశీలించాలని తెలియజేశారు అలాగే ప్రతిరోజు ఒక మెనూ ప్రకారం ప్రీస్కూల్ పిల్లలకు వేడిగా వండిన భోజనాన్ని అందజేయడం జరుగుతుందని తెలిపారు ఈ మెనూని అంగన్వాడి మేనేజ్మెంట్ కమిటీ సభ్యులందరూ కూడా పరిశీలించాలని తెలియజేశారు అలాగే గ్రామంలో ఉన్న లబ్ధిదారులందరూ కూడా మంచి పౌష్టికాహారం తీసుకోవాలని ప్రతి రోజు కూడా సమతుల ఆహారం తీసుకోవాలని అందులో ఆకుకూరలు ,కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలని



తెలియజేశారు ఈ ఆహారంతో పాటు మన పరిసరాల పరిశుభ్రత కూడా అలాగే వ్యక్తిగత పరిశుభ్రత కూడా ఎంతో అవసరం అని చెప్పి తెలియజేశారు అలాగే ఈ నెల 25వ తేదీ నుండి అక్టోబర్ 7వ తేదీ వరకు కూడా ప్రతి అంగన్వాడీ కేంద్రంలో "అంగన్వాడి ఉత్సవం" అనే ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది ప్రతి అంగన్వాడీ కేంద్రంలో కూడా మూడు రోజులపాటు ఈ ప్రోగ్రాం జరుగుతుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో లబ్ధిదారులందరూ కూడా పాల్గొని అంగన్వాడి లో అందించే సేవలు అన్నింటి గురించి కూడా తెలుసుకోవాలని తెలియజేశారు ఈ అంగన్వాడి ఉత్సవం ప్రోగ్రామ్ ఒక పండగ వాతావరణం లో అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు శిరీష సుహాసిని మరియు అంగన్వాడి కార్యకర్తలు తల్లులు తదితరులు పాల్గొన్నారు

# శ్రీకాళహస్తిలో వైభవంగా 72వ సీనియర్ నేషనల్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

**జాతీయ స్థాయి క్రీడాకారులకు ఘన స్వాగతం.. పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ కుమార్**

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 25:**
ఆధ్యాత్మిక క్షేత్రమైన శ్రీకాళహస్తి పట్టణం జాతీయ స్థాయి క్రీడా సంబరాలకు వేదికగా మారింది. పట్టణంలోని ఎస్.వి. ఆర్ట్స్ కాలేజ్, మహిళా డిగ్రీ కాలేజ్ ప్రాంగణాల్లో 72వ సీనియర్ నేషనల్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్2026 (పురుషులు, మహిళలు) పోటీలు శుక్రవారం ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి.

నిర్వాహకుల ప్రత్యేక ఆహ్వానం మేరకు శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను అధికారికంగా ప్రారంభించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులను వారు అభినందిస్తూ, పోటీలు విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. శ్రీకాళహస్తి వంటి పవిత్ర పుణ్యక్షేత్రంలో జాతీయ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించడం ఎంతో ఆనందంగా, అభినందనీయంగా ఉందన్నారు. దేశ నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులకు శ్రీకాళహస్తి ప్రజల తరఫున ఆత్మీయ స్వాగతం పలుకుతున్నామని తెలిపారు.

క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని, క్రమశిక్షణను పెంపొందిస్తాయని పేర్కొన్న ఆయన.. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తిలో క్రీడారంగ అభివృద్ధికి మరింత









ప్రాధాన్యతనిస్తూ, అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని చెప్పారు.

భవిష్యత్తులో శ్రీకాళహస్తిలో మరిన్ని జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించేందుకు తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులకు శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దివ్యదర్శనం కల్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

**విజేతలకు రూ.లక్ష నగదు బహుమతి**

క్రీడాకారుల్లో మరింత ఉత్సాహాన్ని నింపేలా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. ఈ జాతీయ స్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి సాధించే విజేతలకు తన సొంత నిధుల నుంచి రూ. 1,00,000 నగదు బహుమతిని అందజేస్తానని ప్రకటించారు.

ఎమ్మెల్యే చేసిన ఈ ఉదార ప్రకటనకు క్రీడాకారులు, నిర్వాహకులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రజాప్రతినిధి తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయమని వారు పేర్కొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు శ్రీకాళహస్తి వేదిక కావడం పట్టణ క్రీడా చరిత్రలో ప్రత్యేక ఘట్టంగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు, కోచ్‌లు, క్రీడా సంఘాల ప్రతినిధులతో పోటీ ప్రాంగణం సందడిగా మారింది.

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ కుమార్, కూటమి కుటుంబ సభ్యులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు, కోచ్‌లు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వందేమాతర గేయ సమ్మేళనం






**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 25**
నంద్యాల లో స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాల నందు వందేమాతరం గేయ సమ్మేళన అనే కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ జి.రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. మరియు డైరెక్టర్ డా . జి .హేమంత్ రెడ్డి , ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు ఎంతోమంది ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు.

ముందుగా ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థుల ఉపన్యాసాలతో మొదలుపెట్టారు. విద్యార్థులు అందరూ కూడా ఎంతో చక్కగా వందేమాతరం గేయం గురించి విద్యార్థులందరికీ తెలియతెలియజేశారు.

ఎంతో చక్కగా విద్యార్థులు వందేమాతరం గేయాన్ని నృత్యంతో ప్రదర్శించారు.

కళాశాల ప్రొఫెసర్ జి.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నమామి భారతం విద్యా భారతి ఆధ్వర్యంలో అఖిల భారతీయ స్థాయిలో వందేమాతరం గేయాన్ని ఆలపిద్దాం అని అందరికీ పిలుపునిచ్చారు. వందేమాతరం అనేది భారతదేశం యొక్క జాతీయ గేయం. ఇది మన మాతృభూమి అయిన భరతమాతను కీర్తిస్తూ, స్వాతంత్ర్యోద్యమంలో ప్రజలలో దేశభక్తిని రగిలించిన గొప్ప గీతందీనిని బంకిమ్ చంద్ర ఛటర్జీ 1870లలో బెంగాలీ మరియు సంస్కృతంలో రాశారు. ఇది 1882లో ఆయన రచించిన ప్రసిద్ధ నవల 'ఆనందమఠ్' లో ప్రచురితమైంది.1905లో బెంగాల్ విభజన వ్యతిరేక ఉద్య సమయంలో ఈ నినాదం, గేయం దేశవ్యాప్తంగా స్వాతంత్ర్య సమరయోధుల్లో నూతనోత్సాహాన్ని, దేశభక్తిని నింపింది. భారతదేశంలో ప్రతి ఒక్క చోట పూర్తి వందేమాతరం గేయ ఆలాపన జరపాలి అని కేంద్ర ప్రభుత్వం వారు అందరికీ తెలియజేశారు. దేశంలో ప్రతి ఒక్క చోట 11 గంటలకి వందేమాతర గేయ ఆలాపన మొదలై 11: 5 నిమిషాలు ముగించాలి అని తెలియజేశారు. దీనివలన వందేమాతర గేయం గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు చేసుకుంటుందని తెలియజేశారు. ఈ నూతన వందేమాతరంలో మన వెనుక తరాల వారు ఎలా మనకు స్వాతంత్రం తెచ్చారు వారు ఎలా ప్రాణాలను త్యాగం చేశారు మన కోసమనేది వివరించారు. ఈ కార్యక్రమం మన కళాశాలలో నిర్వహించినందుకు ఎంతో సంతోషంగా ఉంది అని తెలియజేశారు. ఈ మహా సమ్మేళనంలో 800 విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రావణి కుమారి గారు మాట్లాడుతూ వందేమాతర గేయం మన జాతీయ గీతం ఈరోజు ఈ గేయాన్ని పూర్తిగా ఆలపించడం మన అదృష్టం అని తెలియజేశారు. దేశంలో వివిధ చోట్ల ఈరోజు వందేమాతర గేయ ఆలాపన సమ్మేళనాలను నిర్వహించాలి అని కేంద్ర ప్రభుత్వం వారు అందరికీ తెలియజేశారు. విద్యా భారతి అఖిల భారతీయ విద్యా సంస్థ వందేమాతరం సామూహిక గానం ఆలపించాలని పిలుపునిచ్చారు. ఈ మహా సమ్మేళనంలో ఎంతోమంది విద్యార్థులు మరియు అధ్యాపక బృందం ఎంతో చురుగ్గా పాల్గొని ఈ మహా సమ్మేళనాన్ని ఎంతో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం చివరగా జాతీయ గే ఆలాపనతో ముగించారు.

# నులిపురుగులపై సమరభేరి-జిల్లాలో 4.38 లక్షల మందికి ఆల్బెండజోల్ మాత్రలు

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 25**
జిల్లా వ్యాప్తంగా జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని వైద్య, విద్య, ఐసీడీఎస్, సాంఘిక సంక్షేమ తదితర శాఖల సమన్వయంతో నిర్వహించారు. 1 నుంచి 19 ఏళ్ల వయసు వారికి ఆల్బెండజోల్ 400 మి.గ్రా. మాత్రలను పంపిణీ చేశారు.

జూపాడుబంగ్లా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్, డీఎంహెచ్ఓ డాక్టర్ శారదాబాయి



కార్యక్రమాన్ని ప్రారంభించారు. నంద్యాల ఖాదర్‌బాద్ నరసింహరావు మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్‌లో డిప్యూటీ డైరెక్టర్, జిల్లా ప్రోగ్రాం అధికారి అనిల్‌కుమార్‌రెడ్డి విద్యార్థులకు నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించారు.జిల్లాలో 4,46,400 మందిని లక్ష్యంగా గుర్తించగా, తొలిరోజే 4,38,364 మందికి మాత్రలు మింగించి 98.2 శాతం కవరేజీ సాధించినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ శారదాబాయి తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని వైద్యులు సూచించారు.

# విద్యార్థినులకు శక్తి యాప్ రక్షణ కల్పిస్తుంది ఆపద సమయాల్లో అండగా ఉంటుంది

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 25**
విద్యార్థినులకు శక్తి యాప్ రక్షణ కల్పిస్తుందని, ఆపదసమయం లో అండగా ఉంటుందని నంద్యాల జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ సీఐ జయరాం పేర్కొన్నారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు శక్తి యాప్ పై అవగాహన కల్పించారు.

**ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ**

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఏపీ సమగ్ర శిక్ష నందు అక్కడ ఇంటర్మీడియట్ చదువుతున్న బాలికలకు ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసినటువంటి శక్తియాకులపై మరియు ఫైబర్ నేరాలపై ఇప్పుడు కొత్తగా సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నటువంటి 80 జనరేషన్ ఫోటోల గురించి ఆ ఫోటోలు అప్లోడ్ చేయడం వల్ల మీ యొక్క గోప్యత సమాచారాన్ని కొంతమంది సైబర్ నేరగాళ్ల చేతుల్లో పడితే మీ ఫోటోలను మార్ఫింగ్ చేసి మీకు బ్లాక్ మెయిల్ ద్వారా బెదిరించుకొని మీ నుంచి డబ్బులు వసూలు చేయడం గానీ లేదా మీ యొక్క పరువు ప్రతిష్ట లకు సంబంధించిన ఏదైనా నేరాలు జరగవచ్చు అన్నారు. ఎటువంటి సమాచారం లేకుండా మీకు గిఫ్ట్ వచ్చినాయి పార్సిల్స్ వచ్చినాయి అన్నప్పుడు మీరు



ఓటీపీ నెంబర్లు చెప్పకపోవడం మంచిది అన్నారు. ఒంటరిగా బయటికి వెళ్లినప్పుడు శక్తి యాప్ లో మీ ఫోన్ లో డౌన్లోడ్ చేసుకోవడం మీ యొక్క పరిసరాలలో అనుమానాస్పద వ్యక్తులు తిరుగుతున్నారు అని తెలిసినప్పుడు ప్రిన్సిపల్ కు కానీ అధ్యాపకులకు గాని అధ్యాపకులకు లేదా కుటుంబ సభ్యులకు సమాచారం తెలియజేయాలి అన్నారు. ఆపద సమయంలో 112 ఫోన్ నెంబర్లను ఉపయోగించుకోవాలి సైబర్ నేరాలు జరిగినప్పుడు 1930 ఫోన్ నెంబర్లను ఉపయోగించుకోవాలి ఏదైనా పరీక్షలు రాసేటప్పుడు దూరప్రాంతాలకు వెళ్ళినప్పుడు వన్ స్టాప్ సెంటర్ సహాయం కోరి అక్కడ వసతి తీసుకోగలరు అని పేర్కొన్నారు.

# ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న కోటంరెడ్డి గిరిజన రెడ్డి



**నెల్లూరు సెప్టెంబర్ 25 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**
నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, స్థానిక సమస్యలను కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు అందించిన వినతులను ఆయన సానుకూలంగా స్వీకరించి, సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రతి రోజు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో నెల్లూరు రూరల్ ప్రజలకు ఉదయం 7 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నాము. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి
రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు , రాష్ట్ర మంత్రి నారా లోకేష్ గార్ల ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది, కావున ప్రజలందరూ కూడా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరుకుంటున్నాము. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి
ప్రజల సూచనలు, సలహాల మేరకే నెల్లూరు రూరల్ లో అభివృద్ధి పనులు సాగుతున్నాయి. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి
ఇంత మంచి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి, రాష్ట్ర




ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు కి మరియు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కి మీ అందరి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలి. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి
పై కార్యక్రమంలో నగర మాజీ మేయర్ నందిమండలం భాను శ్రీ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం ఇన్చార్జ్ దాట్ల చక్రవర్దన్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జు జలదంకి సుధాకర్, సాబీర్ ఖాన్, 2వ డివిజన్ టిడిపి అధ్యక్షుడు మేకల అనిల్, టీడీపీ నాయకులు శ్రీనివాసులు, వడ్లమూడి రమేష్ చౌదరి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# మహానంది ఆలయంలో కీలక నిర్ణయాలు-దసరా వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 25:**
నంద్యాల జిల్లా శ్రీ మహానందీశ్వరస్వామి వారి దేవస్థానం ధర్మకర్తల మండలి సమావేశం చైర్మన్ నరాల చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సమావేశంలో 202627 సాధారణ, అన్నదాన బడ్జెట్లను పరిశీలించి ఆమోదించారు. దేవస్థానం పరిధిలోని దుకాణాల అద్దెలు, లీజు బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్ణయించారు.

దసరా శరన్నవరాత్రులను అక్టోబర్ 11 నుంచి 20 వరకు నిర్వహించేందుకు నిర్ణయించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రత్యేక పూజల నిర్వహణ, పారిశుద్ధ్య సిబ్బంది సేవలు, దేవస్థాన అభివృద్ధి పనులపై కూడా సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు.

# నంద్యాలలో 217 పోలింగ్ కేంద్రాల ముసాయిదా

**52 వార్డులకు సంబంధించి జాబితా విడుదల- అభ్యంతరాలకు రేపే తుది గడువు**



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 25**

నంద్యాల పురపాలక సంఘం పరిధిలో రానున్న ఎన్నికలకు సంబంధించి 52 వార్డులకు 217 పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న శుక్రవారం విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ జాబితాను ప్రకటించినట్లు తెలిపారు.వార్డు వారీగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వివరాలను ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంచారు. పోలింగ్ కేంద్రాలపై ప్రజలకు ఏవైనా అభ్యంతరాలు, సూచనలు ఉంటే సెప్టెంబర్ 26వ తేదీ వరకు సంబంధిత మున్సిపల్ కార్యాలయంలో తెలియజేయాలని అధికారులు సూచించారు. ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలు, సూచనలను పరిశీలించిన అనంతరం తుది పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రకటించనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి. శేషన్నతో పాటు ఎంఈ నాగభూషణం రెడ్డి, డీఈలు పవన్ కుమార్, రసూల్, శానిటేషన్ సూపర్వైజర్లు మురళీధర్, శివప్రసాద్ రెడ్డి, రెవెన్యూ అధికారి వెంకటరెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం పేరు గొప్ప... అధికారుల పని శూన్యం!

**తడ, పెన్ పవర్, సెప్టెంబర్ 25**

తిరుపతి జిల్లా తడ మండలం కారిజాత గ్రామంలో పారిశుధ్యం పడకేసింది.వీధి వీధినా చెత్త కుప్పలు తెప్పలుగా పేరుకుపోతుంటే... ప్రజలు రోగాల బారిన పడుతుంటే అడిగే నాథుడే కరువయ్యాడు.గత రెండు, మూడు నెలలుగా ఇక్కడ జరుగుతున్న భాగవతం అంతా ఇదే..... రోజూ ఉదయాన్నే రావడం, ఏదో ఒక మూల నిలబడి ఓ ఫోటో క్లిక్ అనిపించడం, పైఅధికారులకు వాట్సాప్‌లో పంపేసి డ్యూటీ అయిపోయిందని బోర్డు తిప్పేయడం. పంచాయతీ పాలనను పర్యవేక్షించాల్సిన పంచాయతీ కార్యదర్శి ఏ నిద్రమత్తులో ఉన్నారు. నెలకు జీతాలు, చేతికి ముడుపులు అందుతుంటే... గ్రామం ఏమైపోతే మాకేంటి అన్నట్లు సెక్రటరీ వ్యవహరిస్తుండటంతోనే పారిశుధ్య సిబ్బందికి ఈ స్థాయిలో తెగింపు వచ్చిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఎన్నాళ్లీ నాటకాలు ఫోటోలకు ఇచ్చే ప్రాధాన్యం మా ప్రాణాలకు ఇవ్వరా. ప్రజాధనాన్ని ఇలా నెల నెల ముడుపుల రూపంలో దోచేస్తుంటే మేము చూస్తూ ఊరుకోవాలా అనీ కారిజాత గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం



వ్యక్తం చేస్తున్నారు.... నివేదికల్లో వచ్చే ఫోటోలు చూసి కలరింగ్ ఇవ్వడం కాదు... ఒక్కసారి ఏసీ గదుల నుంచి బయటకు వచ్చి కారిజాత గ్రామంలో అడుగుపెట్టండి. అసలు సిబ్బంది డ్యూటీ చేస్తున్నారా. ఆ వీధి ముఖం చూస్తున్నారా లేదా అని గ్రామంలోని ప్రతీ ఇంటినీ అడిగి తెలుసుకోండి. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి... ఈ దొంగ ఫోటోల భాగవతానికి, నిధుల దుర్వినియోగానికి బాధ్యులైన పంచాయతీ కార్యదర్శి మరియు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# కుందూ వంతెనపై మంత్రి ఫరూక్ పరిశీలన

## శాశ్వత పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 25**

వైఎస్సార్ నగర్, నందమూరి నగర్ ప్రజల రాకపోకలకు ప్రధాన ఆధారమైన కుందూ నది వంతెనను రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ శుక్రవారం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వర్షాకాలంలో నది ప్రవాహం పెరిగినప్పుడు వంతెనపై ఎదురవుతున్న ఇబ్బందులను ఆయన పరిశీలించారు.

ప్రజలకు సురక్షితమైన, నిరంతరాయ రవాణా సౌకర్యం కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వంతెన పటిష్టత, అభివృద్ధి పనులపై తక్షణమే నివేదిక రూపొందించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు.

కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషన్న, ఎమ్ ఈ నాగభూషణం రెడ్డి. డీఈలు పవన్ కుమార్. రసూల్. అర్బన్ తాసిల్దార్ శ్రీనివాసులు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విక్రమ్. నంద్యాల మండల టీడీపీ కన్వీనర్ మునగల విశ్వనాథరెడ్డి, తాటికొండ బుగ్గ రాముడు, చంద్రారెడ్డి, మహేష్ తదితరులు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# సీఎం, డిప్యూటీ సీఎం పర్యటనను విజయవంతం చేయాలి : ఎమ్మెల్యే డా.పాశిం సునీల్ కుమార్.

**గూడూరు, పెన్ పవర్, సెప్టెంబర్,25:**



పల్లె పండుగలు3.0 కార్యక్రమంలో భాగంగా ఈ నెల 29న ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు మండలం రామాపురం గ్రామానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రానున్న నేపథ్యంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి జన సమీకరణపై సమావేశం నిర్వహించారు.

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అధ్యక్షతన రూరల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో గూడూరు ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాశిం సునీల్ కుమార్ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్‌కు కొత్త ఊపిరి,నూతన కార్యాలయం ప్రారంభం








**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 25**

నూతనంగా ఏర్పాటైన నంద్యాల జిల్లా ప్రజా పరిషత్ పరిపాలనా కార్యకలాపాలకు శ్రీకారం చుట్టారు. నంద్యాల మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలోని మండల్ రిసోర్స్ సెంటర్ భవనంలో ఏర్పాటు చేసిన నూతన జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్, ప్రత్యేక అధికారి జి. రాజకుమారి శుక్రవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో సమర్థవంతంగా అమలు చేయడమే లక్ష్యమన్నారు. నంద్యాల జిల్లాలో అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని జిల్లా ప్రజా పరిషత్‌ను మరింత అభివృద్ధి చేయడానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు.నూతన జిల్లా ప్రజా పరిషత్‌కు సీఈఓ, డిప్యూటీ సీఈఓల నియామక ప్రక్రియ త్వరలో పూర్తవుతుందని చెప్పారు. ఉమ్మడి జిల్లా ప్రజా పరిషత్ నుంచి 45 మంది ఉద్యోగులను నంద్యాల జిల్లా ప్రజా పరిషత్‌కు కేటాయించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సీఈఓ సుధాకర్ రెడ్డి, డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, ఆర్డీఓ విశ్వనాథ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు ఆదాయానికి ఊతం,,ఉద్యాన, వ్యవసాయ రంగాల సమగ్ర అభివృద్ధికి కార్యాచరణ

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 25:**

రాయలసీమలో వ్యవసాయ, ఉద్యాన, నీటిపారుదల రంగాలను సమన్వయంతో అభివృద్ధి చేసి రైతుల ఆదాయాన్ని పెంచేందుకు 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌రాయలసీమ రైజింగ్' కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. జూపాడు బంగ్లాలో నిర్వహించిన ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక అనంతరం నందికొట్కూరు ప్రాజెక్టు డీపీఆర్‌ను ఎమ్మెల్యేకు అందజేశారు.

నంద్యాల జిల్లాలో ప్రస్తుతం సుమారు 40 వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగవుతున్నాయని కలెక్టర్ తెలిపారు. జిల్లాను 15 క్లస్టర్లుగా విభజించి మూడు దశల్లో ఉద్యాన రంగ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. తక్కువ ఆదాయం ఉన్న మండలాల్లో ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ వంటి అధిక ఆదాయ పంటలను ప్రోత్సహిస్తామన్నారు.

రాయలసీమలోని ఉద్యాన పంటలను అంతర్జాతీయ మార్కెట్లకు అనుసంధానం చేసి రైతులకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించడమే గ్లోబల్ హార్టికల్చర్ హబ్ లక్ష్యమన్నారు. డోన్ ప్రాంతంలో ఉద్యాన పంటల ద్వారా రైతులు సాధిస్తున్న ఫలితాలను ఇతర ప్రాంతాలకు విస్తరించాలని సూచించారు.

మండలాల వారీగా తలసరి ఆదాయ వ్యత్యాసాలను గుర్తించి తక్కువ ఆదాయం ఉన్న ప్రాంతాలకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఉద్యాన, ఆయిల్‌పామ్ పంటల ద్వారా రైతుల ఆదాయంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం



చేయాలని అధికారులను ఆదేశించారు.

నందికొట్కూరు అభివృద్ధి ప్రాజెక్టు డీపీఆర్ పూర్తయిందని, ఎమ్మెల్యే సమక్షంలో తదుపరి ప్రక్రియ పూర్తి చేసి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు.

# ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతికి పరిష్కారమే లక్ష్యం

## వీపీఆర్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించిన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి







**నెల్లూరు సెప్టెంబర్ 25 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

కోవూరు నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారమే ప్రాధాన్యంగా పనిచేస్తున్నామని కోవూరు శాసనసభ్యులు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. శుక్రవారం నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి, నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతిపత్రాలను ఆమె స్వయంగా స్వీకరించారు. ప్రజాదర్బార్‌కు వచ్చిన ప్రజల సమస్యల వివరాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. తక్షణ పరిష్కారం సాధ్యమయ్యే అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో అక్కడికక్కడే ఫోన్‌లో మాట్లాడి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మిగిలిన విజ్ఞప్తులను తగిన పరిశీలన కోసం అధికారులకు పంపించారు.

ప్రజాదర్బార్ ద్వారా క్షేత్రస్థాయి సమస్యలను నేరుగా తెలుసుకోవడంతో పాటు, వాటి పరిష్కారానికి అధికార యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తెలిపారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రతి వినతికీ సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపేలా కృషి చేస్తామన్నారు.

# "మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ"

## డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలిలి : YSRTUC జిల్లా అధ్యక్షుడు బోడి లింగాలపాడు జై కుమార్ రెడ్డి

**నెల్లూరు, సెప్టెంబర్ 25 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువత, క్రీడాకారులు, ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా వారి హక్కులకు భంగం కలిగిస్తోందని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (YSRTUC) నేతలు ఆరోపించారు.

శుక్రవారం నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో (YSRTUC) నెల్లూరు జిల్లా అధ్యక్షులు జయకుమార్ రెడ్డి, ొ౼ఖజ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజేష్ కుమార్ మాట్లాడారు.

ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని వారు విమర్శించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

20 లక్షల ఉద్యోగాల హామీ ఏమైంది?

ఎన్నికల సమయంలో రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, నెలకు ₹3,000 నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారని (YSRTUC) నేతలు పేర్కొన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీల అమలుపై స్పష్టత లేకుండా పోయిందని విమర్శించారు.

అదేవిధంగా, గత ప్రభుత్వ హయాంలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానాల్లో పనిచేసిన ఉద్యోగుల పరిస్థితిపై కూడా ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగాలపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

"మెగా డీఎస్సీ"పై సీబీఐ విచారణకు డిమాండ్

ప్రభుత్వం నిర్వహిస్తున్న మెగా డీఎస్సీ నియామక ప్రక్రియపై అనేక అనుమానాలు, ఆరోపణలు వ్యక్తమవుతున్నాయనిొ౼ఖజ నేతలు అన్నారు. అందుకే దీనిని లి"మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ"లిగా అభివర్ణించారు.

డీఎస్సీ నియామక ప్రక్రియలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి గారు ఆధారాలతో పలు అంశాలను ప్రజల ముందుకు తీసుకువచ్చారని పేర్కొంటూ, ప్రభుత్వం నిజంగా పారదర్శకతకు కట్టుబడి ఉంటే సీబీఐ విచారణకు ఆదేశించాలని సవాల్ చేశారు.

డీఎస్సీ వ్యవహారంపై నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు.

పూనూరు గౌతమ్ రెడ్డిపై దాడిని ఖండిస్తున్నాంవిజయవాడలోని ౼ూ౼ూ కార్యాలయం వద్ద క్రీడా కోటా డీఎస్సీ నియామకాలకు సంబంధించిన ఆరోపణలపై శాంతియుతంగా నిరసన చేపట్టినొ౼ఖజ రాష్ట్ర అధ్యక్షులు పూనూరు గౌతమ్ రెడ్డి, నిరుద్యోగ అభ్యర్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేశారన్న ఆరోపణలను YSRTUC నేతలు తీవ్రంగా ఖండించారు.

నిరుద్యోగ యువత తమ సమస్యలను ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యక్తం చేసే హక్కును ప్రభుత్వం గౌరవించాలని కోరారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

కార్మిక వర్గానికి సంబంధించిన పలు సమస్యలను కూడా (YSRTUC) నేతలు ప్రస్తావించారు.

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి హయాంలో ఏర్పాటైన భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ వ్యవస్థకు సంబంధించిన నిధులు, పథకాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు.

అలాగే ఆర్టీసీ కార్మికుల సమస్యలు, మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలు, ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కార్మికుల జీవనోపాధి, ఉద్యోగ భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.



(YSRTUC) ప్రధాన డిమాండ్లు

విజయవాడలో నిరసనకారులపై జరిగిన లాఠీచార్జ్ ఘటనపై న్యాయపరమైన విచారణ జరిపించాలి. ఘటనకు బాధ్యులైన అధికారులపై విచారణ జరిపి, బాధ్యత నిర్ధారించాలి.పోలీసుల చర్యల్లో గాయపడిన నిరుద్యోగులు, డీఎస్సీ అభ్యర్థులకు తగిన నష్టపరిహారం అందించాలి.క్రీడా కోటా నియామకాలు, డీఎస్సీ నియామక ప్రక్రియపై వచ్చిన ఆరోపణలపై నిష్పాక్షికమైన సమగ్ర విచారణ జరిపించాలి.డీఎస్సీ నియామకాల్లో పారదర్శకతను నిర్ధారించి అభ్యర్థులకు న్యాయం చేయాలి. నిరుద్యోగ యువతకు ఇచ్చిన ఉద్యోగ, నిరుద్యోగ భృతి హామీలపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలి. కార్మికులు, ఉద్యోగులు, ఆశా వర్కర్లు, పారిశుధ్య కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి.

ప్రజాస్వామ్య పద్ధతిలో తమ హక్కుల కోసం పోరాడుతున్న నిరుద్యోగులు, ఉద్యోగులు, కార్మికుల గొంతును అణచివేయడం సరైన పద్ధతి కాదని (YSRTUC) నేతలు అన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం, నిరుద్యోగ యువత మరియు కార్మిక వర్గాల హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటాన్ని మరింత బలోపేతం చేస్తామని వారు తెలిపారు.

ఈ కార్యక్రమంలో(YSRTUC) నియోజకవర్గ అధ్యక్షులు నవీన్ కుమార్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు

**- దేశాభివృద్ధికి దీనదయాళ్ ఉపాధ్యాయ సేవలు చిరస్మరణీయం**
**- బీజేపీ పట్టణ అధ్యక్షుడు కే. దయాకర్.**

**గూడూరు, పెన్ పవర్, సెప్టెంబర్,25:**

గూడూరు పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను గూడూరు అర్బన్ బీజేపీ అధ్యక్షుడు కే. దయాకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కార్యక్రమానికి ముందుగా దీనదయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గూడూరు పట్టణ బీజేపీ అధ్యక్షుడు కే. దయాకర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు బాలకృష్ణ నాయుడు మాట్లాడుతూ, దీనదయాళ్



ఉపాధ్యాయ దేశానికి అందించిన సేవలను కొనియాడారు. దీనదయాళ్ ఉపాధ్యాయ భారతీయ జనసంఘ్ అభివృద్ధికి విశేష కృషి చేశారని, ఆయన ప్రవచించిన అంత్యోదయ, ఏకాత్మ మానవతావాద సిద్ధాంతాలు సమాజంలోని చివరి వ్యక్తి అభ్యున్నతికి మార్గదర్శకంగా నిలిచాయని పేర్కొన్నారు. సమాజంలోని పేదలు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని పిలుపునిచ్చారు.

దీనదయాళ్ ఉపాధ్యాయ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, దేశాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు సూచించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ కమిటీ ప్రధాన కార్యదర్శులు బాలకృష్ణ గౌడ్,ఎం రవీంద్ర,ఉపాధ్యక్షులు ఐ. సురేష్ బాబు,గుమ్మడి శ్రీనివాసులు,కోశాధికారి నిరంజన్,ఓబీసీ మోర్చా అధ్యక్షులు కటికాల సురేష్, సి హెచ్ మస్తాన్ ,మహిళా మోర్చా అధ్యక్షులు బాలమణి,ఎస్సీ మోర్చా అధ్యక్షులు మధుసూదన్,మహిళా నాయకులు గుంజి భవాని, ఉమ తదితరులు పాల్గొనారు.

# జగన్ లో కొత్త ఆందోళన

**విశాఖపట్టణం, సెప్టెంబర్ 25, పెన్ పవర్:** ఓటమి ఇచ్చిన గాయం కంటే, రానున్న రోజుల్లో చుట్టుముట్టబోయే చట్టపరమైన ఉచ్చులే వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలో ఆందోళనను రేకెత్తిస్తున్నట్లు కనిపిస్తోంది. ఇటీవల ఆయన అడుగులు, ప్రసంగాలు, ఆకస్మిక కార్యాచరణలను నిశితంగా పరిశీలిస్తే ఆ అంతర్గత కంగారు స్పష్టంగా బయటపడుతోంది. నిరుద్యోగులను రెచ్చగొట్టేందుకు డీఎస్సీ క్రీడా కోటాపై ఆధారాల్లేని ఆరోపణలు గుప్పించడం, ఏ చిన్న అవకాశాన్ని వదలకుండా హుటాహుటిన రాజ్ భవన్‌కు పరుగులెత్తి గవర్నర్‌కు వినతిపత్రాలు సమర్పించడం వంటివి ఆయన కంగారును చూపిస్తున్నాయి.ఏపీలో గత ఐదేళ్ల పాలనలో సాగిన భారీ లిక్కర్ సిండికేట్ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ శరవేగంగా పావులు కదుపుతోంది. ఢిల్లీ మద్యం కుంభకోణాన్ని మించిన రీతిలో సాగిన నగదు లావాదేవీలు, డిస్టిలరీల బెదిరింపులు, ప్రత్యేక బ్రాండ్ల ముసుగులో జరిగిన దోపిడీకి సంబంధించిన మనీ ట్రయల్స్ చిక్కుముడులను దర్యాప్తు సంస్థలు పక్కా ఆధారాలతో ఛేదించినట్లు ఢిల్లీ వర్గాల సమాచారం. దర్యాప్తు పరిధి విస్తరిస్తున్న కొద్దీ తాడేపల్లి కీలక చక్రాల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా, తెరవెనుక ఆర్థిక లావాదేవీలను పర్యవేక్షించినట్లు ప్రచారంలో ఉన్న ఆయన సమీప బంధువు అనిల్ రెడ్డి పాత్రపై దర్యాప్తు సంస్థల నిఘా మరింత కఠినతరమైంది. లిక్కర్ స్కామ్‌లో ముడుపుల సేకరణ, వాటిని హవాలా మార్గాల్లోకి మళ్లించడం వెనుక కీలక సూత్రధారిగా భావిస్తున్న అనిల్ రెడ్డిని ఈడీ ఏ క్షణమైనా అదుపులోకి తీసుకునే అవకాశముందన్న గుసగుసలు తారాస్థాయికి చేరాయి. ఒకసారి సూత్రధారులు పట్టుబడితే దర్యాప్తు సెగ నేరుగా అధినేత ద్వారాలనే తాకుతుందని జగన్‌కు స్పష్టంగా అర్థమైపోయింది. అందుకే గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకవైపు మీడియా సమావేశాల్లో దూకుడు ప్రదర్శిస్తూనే, మరోవైపు తీవ్ర నైతిక రక్షణలోకి వెళ్లే పరిస్థితి తలెత్తింది. ఇదే సమయంలో ఆయన బెంగళూరు ప్యాలెస్ కేంద్రంగా సాగుతున్న రహస్య మంతనాలు సరికొత్త రాజకీయ చర్చకు తెరలేపాయి. తన ప్రభుత్వ హయాంలో వైఎస్సార్‌సీపీ తరపున రాజ్యసభకు పంపిన రిలయన్స్ గ్రూప్ కీలక ప్రతినిధి పరిమళ్ నత్వానీ ఇటీవల బెంగళూరులో ఓ వివాహ వేడుకకు హాజరైనప్పుడు.. జగన్ ఆయనను ప్రత్యేకంగా తన నివాసానికి ఆహ్వానించి ఏకాంత చర్చలు జరిపారు. కేంద్ర ప్రభుత్వ పెద్దలతో సత్సంబంధాలు, ఢిల్లీ రాజకీయాల్లో విస్తృత పలుకుబడి ఉన్న పరిమళ్ నత్వానీతో జగన్ ఏం మాట్లాడి ఉంటారనేది ఊహించడం పెద్ద కష్టమేమీ కాదు. కేసులు ముంచుకొస్తున్న వేళ ఢిల్లీ స్థాయిలో రాయబారాలు నడిపి రక్షణ పొందడానికే ఈ ఆకస్మిక లంచ్ డిప్లొమసీని ఉపయోగించుకున్నారు. ఒకవైపు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ అమలు, పోలవరం పనుల పునరుద్ధరణ, రాజధాని నిర్మాణాలతో ముందుకెళ్తుంటే.. మరోవైపు జగన్ మాత్రం పాత స్క్రిప్టులు వల్లెవేస్తూ, కల్పిత ఆరోపణలతో కాలం వెళ్లదీస్తున్నారు. పచ్చి అబద్ధాలతో ప్రజలను నమ్మించలేమని తెలిసినప్పటికీ, కేసుల నుంచి ప్రజా దృష్టిని మరల్చడానికి ఆయన చేస్తున్న ఈ ఆపసోపాలు సొంత కేడర్‌లోనే నమ్మకాన్ని సన్నగిల్లేలా చేస్తున్నాయి. కేంద్ర దర్యాప్తు సంస్థల దూకుడు, అనిల్ రెడ్డి చుట్టూ బిగుస్తున్న ఉచ్చు, బెంగళూరు రహస్య భేటీలు.. ఇవన్నీ జగన్ రాజకీయ భవితవ్యం తీవ్ర సంక్షోభంలో పడిందనడానికి ప్రత్యక్ష నిదర్శనాలుగా నిలుస్తున్నాయివైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ నేతలను పిలిపించుకుని ప్రసంగించారు. ఎప్పుడూ చెప్పే మాటలే చెప్పారు. కూటమి ప్రభుత్వంపై అడ్డగోలు విమర్శలు గుప్పించడంతో పాటు.. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులన్నింటినీ గతంలో తామే చేసేశామని, భోగాపురం ఎయిర్‌పోర్టు నుంచి అదానీ డేటా సెంటర్ దాకా అన్నీ తమ ఘనతేనంటూ ఆయన చెప్పుకున్నారు. విశాఖకు ఐటీ కంపెనీలను తరిమేసి, రుషికొండను బోడిగుండు చేసి విలాసవంతమైన ప్యాలెస్ నిర్మించుకున్న ఘన చరిత్రను ప్రజలు ఇంకా మరువకముందే.. తానేదో నగరాన్ని ఉద్ధరించేశానని జగన్ చెప్పుకోవడం విడ్డూరంగా మారింది. తన ఐదేళ్ల పాలనలో ఉత్తరాంధ్రకు రాజధాని ముసుగులో భూకబ్జాలు, గంజాయి దందాలు తప్ప చేసిందేమీ లేదు. అయినా మేం చేసిన అభివృద్ధి కళ్ల ముందే ఉందని చెప్పుకున్నారు. అన్నింటికంటే పరాకాష్ట ఏమిటంటే.. “మా హయాంలో పోలీసులను వాడుకోలేదు, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయలేదు” అంటూ జగన్ చెప్పుకోవడంఅయిదేళ్ల పాటు ప్రత్యర్థి పార్టీల నేతలపై అక్రమ కేసులు, సీఐడీ వేధింపులు, అర్ధరాత్రి అరెస్టులు, ప్రతిపక్ష గొంతు నొక్కేందుకు పోలీసు బలగాలను సొంత ప్రైవేటు సైన్యంగా మార్చుకున్న తీరు యావత్ దేశానికే తెలుసు. అలాంటి వ్యక్తి నేడు పోలీసులపై నిందలు వేస్తూ.. అధికారుల పేర్లను డిజిటల్ డైరీ లో రాసి పెట్టుకోవాలని, మూడేళ్ల తర్వాత తమ ప్రభుత్వం రాగానే సినిమా చూపిస్తామని కేడర్‌ను బహిరంగంగా రెచ్చగొట్టడం ఆయన హింసాత్మక రాజకీయ మనస్తత్వాన్ని తేటతెల్లం చేస్తోంది. వినేవాళ్లు, గుడ్డిగా నమ్మేవాళ్లు ఉంటే జగన్ రెడ్డి ఎలాంటి కట్టుకథలైనా చెబుతారనేందుకు ఆయన ప్రసంగమే సాక్ష్యం. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండటంతో కేడర్‌లో నైతిక స్థైర్యం నశించిందని గ్రహించిన జగన్.. లేని గెలుపును ఊహించుకుంటూ కార్యకర్తలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. కానీ వారేమీ వేరే గ్రహం నుంచి రాలేదు కదా.. జగన్ రెడ్డి పాలన చేసినప్పుడూ వారు ఉన్నారు. తెలియకుండా ఉంటుందా?



# మంత్రి నాదెండ్ల కోటలో రాజకీయం ఎలా ఉంది..?



**హైదరాబాద్ పెన్ పవర్:** తెనాలి నియోజకవర్గంలోని మండలాల పరిధిలో ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తరపున జనసేన పార్టీ ప్రాతినిధ్యం వహిస్తుండగా, రాజకీయాల్లో జోరు కనిపిస్తోంది. ఇదే సమయంలో వైసీపీలో నాయకుల లేమి, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుల వ్యవహారం బేజారుగా మారింది. గతంలో కేవలం తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్ మధ్యే సాగిన ప్రధాన పోటీ, 2024 అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన సీనియర్ నాయకుడు నాదెండ్ల మనోహర్ రంగ ప్రవేశంతో త్రిముఖ పోరుగా మారి, చివరకు కూటమి విజయం సాధించింది.ప్రస్తుతం తెనాలి టౌన్, తెనాలి రూరల్, కొల్లిపర మండలాల పరిధిలో తాజా రాజకీయ సమీకరణాలు మారుతున్నా యి. ఇవి కూటమికి అనుకూలంగా ఉన్నాయి. కూటమి నేత, మంత్రి నాదెండ్ల మనోహర్ నాయకత్వంలో శ్రేణులు జోరుమీదున్నారు. మనోహర్ నియోజకవర్గంలో పట్టు సాధించేందుకు నిరంతరం పర్యటిస్తున్నారు. అభివృద్ధి పనులపై దృష్టి పెట్టారు. ఇటీవల కాలంలో నియోజకవర్గ పరిధిలోని తాగునీటి సమస్యల పరిష్కారానికి, రహదారుల నిర్మాణాలకు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తూ మౌలిక వసతుల కల్పనపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది.

గతంలో ఇక్కడి నుంచి పోటీ చేసిన టీడీపీ స్థానిక నేతలు, జనసేన శ్రేణులతో కలిసి సమన్వయంతో ముందుకు వెళు తున్నారు. వైసీపీ విషయానికి వస్తే.. కేంద్ర కార్యాలయం చేరువగానే ఉన్నా.. నియోజకవర్గంపై పట్టు సాధించక పోవడం గమనార్హం. గత ఎన్నికల్లో ఓటమి చెందిన మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, ఇతర ముఖ్య నాయకులు నియోజకవర్గంలో కార్యక్రమాలకు ముక్తసరిగా హాజరవుతున్నారు.స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మండలాల వ్యాప్తంగా ద్వితీయ శ్రేణి నాయకులు అలర్ట్ అవుతున్నారు. వార్డులు, గ్రామాల పరిధిలో పట్టు నిలుపుకోవడానికి అధికార కూటమి అంతర్గత వ్యూహాలు రచిస్తుండగా, వైసీపీ మాత్రం తిరిగి పుంజుకోవడానికే పరిమితం అవుతోంది. మొత్తంగా చూస్తే, తెనాలి టౌన్, రూరల్ మండలాల పరిధిలో ప్రస్తుతం అధికార పక్షం అభివృద్ధి మంత్రంతో ప్రజల్లోకి వెళ్తుండగా, ప్రతిపక్షం మాత్రం కేడర్‌పై వస్తున్న కేసులను ఎదుర్కొంటూ రాజకీయ ఉనికి కోసం ప్రయాస పడుతోంది.

# పయ్యావుల కేశవ్.. కాసుల కుస్తీ.. !

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రిగా పయ్యావుల కేశవ్ పనితీరుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2024 జూన్ లో ఆయన బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి, రాష్ట్ర ఆర్థిక రంగాన్ని గాడిలో పెట్టేందుకు, కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు నిధులు సమకూర్చేందుకు ఆయన నిరంతరం శ్రమిస్తున్నారు. బడ్జెట్ నిర్వహణ విషయంలో ఆయన ఆపశోపాలు పడుతున్నారన్నది వాస్తవం. వైసీపీ ప్రభుత్వ హయాం నాటి ఆర్థిక ఇబ్బందుల నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించేందుకు ఆయన ప్రణాళికలు రచిస్తున్నారు.

2026–27 ఆర్థిక సంవత్సరానికి గానూ ఆయన రూ. 3.32 లక్షల కోట్ల భారీ బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు, ఇది వ్యవసాయం, సంక్షేమం మరియు పెట్టుబడుల వృద్ధికి ప్రాధాన్యతనిచ్చేలా రూపొందించారు. మరోవైపు కేంద్రంతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, నీతి ఆయోగ్‌తో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తూ, రాష్ట్రానికి రావలసిన నిధులు, ప్రాజెక్టుల సాధనలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ‘వికసిత భారత్ 2047’ వంటి విజన్ కార్యక్రమాల్లో రాష్ట్ర ఆర్థిక నమూనాలపై కేంద్రంతో చర్చిస్తున్నారు.



బ్యాంకర్లతో సమన్వయం: రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి సమావేశాల్లో పాల్గొంటూ రైతులకు, చిన్న వ్యాపారులకు తగినంత రుణ సదుపాయం అందేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల 3,000 కోట్ల రూపాయల క్రెడిట్ అవుట్‌రీచ్‌ను అందించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. అయితే ఈ పనుల ఒత్తిడి కారణంగా ఫైళ్ల పరిష్కారంలో జాప్యం పెరిగిపోతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్నారు. అంతర్గత సమీక్షల్లో ప్రభుత్వ ఫైళ్ల క్లియరెన్స్‌లో పయ్యావుల కేశవ్ ఆఖరి స్థానంలో నిలిచినట్లు నివేదికలు వచ్చాయి. ఆర్థిక శాఖ అత్యంత కీలకమైనది కావడంతో, ప్రతీ ఫైల్‌ను కూలంకషంగా పరిశీలించడం వల్లే ఈ జాప్యం జరుగుతోందనే అభిప్రాయం కూడా ఉంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఆర్థిక అవకతవకలను, స్కామ్‌లను ఎండగట్టడంలో పయ్యావుల దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో వైసీపీ నాయకులు ఆయనపై, ఆయన కుటుంబ నేపథ్యంపై రాజకీయ విమర్శలు గుప్పిస్తున్నారు. వీటిని సమర్థంగా తిప్పి కొట్టలేక ఇబ్బంది పడుతున్నది వాస్తవం. ఇక, క్షేత్రస్థాయిలో ఉరవకొండ నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటున్నా.. ఆశించిన మేరకు సమయం కేటాయించలేక పోతున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ రూట్ మ్యాప్

**విజయవాడ, సెప్టెంబర్ 25, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల ప్రవాహం, పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జాతీయ స్థాయిలో సరికొత్త ఎజెండాను బలంగా వినిపిస్తున్నారు. ఢిల్లీ వేదికగా పారిశ్రామికవేత్తలు, విధాన నిర్ణేతలతో పబ్లిక్ అఫైర్స్ ఫోరం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫైర్‌సైడ్ చాట్ కార్యక్రమంలో ఆయన పాల్గొని రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి రోడ్‌మ్యాప్‌ను వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దశాబ్దాలుగా అమలు చేస్తున్న సమర్థవంతమైన పాలనా నమూనాను గుర్తుచేస్తూ.. పని, జవాబుదారీతనం, నాణ్యమైన సేవలు అనే మూడు మూలస్తంభాలపైనే తమ ప్రభుత్వం నడుస్తోందని స్పష్టం చేశారు. ఒకప్పుడు ప్రపంచమంతా మాట్లాడిన ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దశ దాటిపోయిందని, ఆధునిక పోటీ ప్రపంచంలో వేగమే సర్వస్వమని, అందుకే కూటమి ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను తమ అధికారిక పాలనా సంస్కృతిగా మార్చుకుందని లోకేష్ ప్రకటించారు. పరిపాలనలో జవాబుదారీతనం కేబినెట్ మంత్రుల స్థాయి నుంచే మొదలవుతోందని లోకేష్ స్పష్టం చేశారు. మంత్రుల పనితీరు నివేదికలు , ఫైళ్ల పరిష్కార వేగం , మంత్రుల ర్యాంకింగ్‌లు, క్షేత్రస్థాయిలో కలెక్టర్లతో లైవ్ రివ్యూ సమావేశాలు నిర్వహించడానికి అపారమైన రాజకీయ ధైర్యం అవసరమని పేర్కొన్నారు. ఇలాంటి కఠినమైన పనితీరును ఐదేళ్లపాటు నిరంతరాయంగా కొనసాగిస్తే, ఆ జవాబుదారీతనం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రతి గ్రామంలోని కింది స్థాయి ఉద్యోగి వరకు చేరుతుందని అన్నారు. గత ప్రభుత్వాల మాదిరిగా విలాసవంతమైన ప్యాలెస్‌లు కట్టుకోవడం సులభమేమో కానీ.. నిజమైన సుపరిపాలన అందించడం అంటే ఒక మహత్తర బాధ్యత అని వ్యాఖ్యానించారు. ఇదే సిద్ధాంతం గత 44 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీ పసుపు జెండాను తరతరాలుగా సగర్వంగా నిలబెట్టిందని ఆయన వివరించారు.రాష్ట్రానికి ప్రాజెక్టులను తీసుకురావడంలో తమ ప్రభుత్వం అవలంబిస్తున్న దూకుడు వ్యూహాన్ని లోకేష్ పంచుకున్నారు. ఒకప్పుడు గుజరాత్ రాష్ట్రం ఇతర ప్రాంతాల నుంచి భారీ పరిశ్రమలను తరలించుకుపోతోందని వార్తలు వినే స్థాయి నుంచి, నేడు స్వయంగా గుజరాత్‌కే వెళ్లి అక్కడ వ్యాపార దిగ్గజాల ముందు ఆంధ్రప్రదేశ్‌ను నంబర్ వన్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్‌గా నిలబెట్టేందుకు తాను త్వరలోనే పర్యటించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ నెలకొన్నప్పుడే దేశం అంతిమంగా విజయం సాధిస్తుంది అని స్పష్టం చేశారు. వ్యవసాయం, పారిశ్రామికోత్పత్తి నుంచి సాధారణ పాలన వరకు ప్రతి అంశంలోనూ పనులను శరవేగంగా అమలు చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యమని తెలిపారు.రాష్ట్రంలో పారిశ్రామిక వేగాన్ని మరింత విస్తరించేందుకు 23 ఇండస్ట్రీ క్లస్టర్ల ఏర్పాటుకు ప్రభుత్వం సమగ్ర ప్రణాళిక సిద్ధం చేసిందని లోకేష్ వివరించారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన తయారీ సంస్థలు, స్థానిక నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు , నాణ్యతా పరీక్షా ల్యాబ్‌లు, విద్యా సంస్థలను కేవలం 100 కిలోమీటర్ల పరిధిలోని ఒకే ఎకోసిస్టమ్‌లో అనుసంధానం చేయడమే ఈ క్లస్టర్ల ప్రధాన ఉద్దేశమని చెప్పారు. దీని ద్వారా కంపెనీలకు లాజిస్టిక్స్, ఉత్పత్తి వ్యయాలు భారీగా తగ్గడంతో పాటు అంతర్జాతీయ ఇన్వెస్టర్లను పెద్దఎత్తున ఆకర్షించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ప్రభుత్వం అన్ని రంగాల్లో ముందడుగు వేస్తోందని, ఆంధ్రప్రదేశ్ ఇకపై దేశంలోనే ఇన్వెస్ట్‌మెంట్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తుందని ఫైర్‌సైడ్ చాట్ వేదికగా మంత్రి నారా లోకేష్ ధీమా వ్యక్తం చేశారు.

## విశాఖకు డబుల్ డెక్కర్ ట్రైన్

**విశాఖపట్టణం, సెప్టెంబర్ 25, పెన్ పవర్:** సాగర నగరం విశాఖపట్నం ప్రజా రవాణా వ్యవస్థలో సరికొత్త విప్లవానికి తెరలేచింది. విశాఖ ప్రజలు ఎప్పటినుంచో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రతిష్టాత్మక విశాఖపట్నం డబుల్ డెక్కర్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ కు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ కీలక పరిణామాన్ని ఆంధ్రప్రదేశ్ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ స్వయంగా వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ ఆమోదం లభించడంతో ప్రాజెక్టు పట్టాలెక్కేందుకు మార్గం సుగమమైందని, త్వరలోనే క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. తీర నగరమైన విశాఖ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో భవిష్యత్ ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టును అత్యాధునిక ఇంజనీరింగ్ ప్రమాణాలతో డిజైన్ చేశారు. ఒకే పిల్లర్‌పై దిగువన ఫ్లైఓవర్ రోడ్డు మార్గం, ఎగువన మెట్రో రైలు కారిడార్ వెళ్లేలా డబుల్ డెక్కర్ విధానాన్ని అమలు చేయనున్నారు. భూసేకరణ సమస్యలు, భారీ ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు, ఇరుకైన కారిడార్లలో సాధారణ రోడ్డు రవాణా, ప్రజా రవాణా రెండింటికీ ఇది శాశ్వత పరిష్కారంగా నిలవనుంది. ఈ మెట్రో కారిడార్ ద్వారా నగరంలోని ప్రధాన వాణిజ్య ప్రాంతాలు, ఐటీ కారిడార్లు, విద్యా సంస్థలు, పోర్టు ప్రాంతం, ప్రతిపాదిత భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అనుసంధానానికి విస్తృతమైన లబ్ధి చేకూరనుంది. రోడ్డు ట్రాఫిక్ తీవ్రతను గణనీయంగా తగ్గించడంతో పాటు, సామాన్యులు, ఉద్యోగులు తక్కువ సమయంలో సురక్షితంగా, కాలుష్య రహితంగా ప్రయాణించేందుకు ఈ ప్రాజెక్ట్ అత్యంత కీలకం కానుంది. విశాఖను గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా, ఏపీ ఆర్థిక రాజధానిగా తీర్చిదిద్దాలన్న కూటమి ప్రభుత్వ సంకల్పానికి కేంద్రం ఆమోదం మరింత వేగాన్ని చేకూర్చింది. కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి భాగస్వామ్యంతో శరవేగంగా నిధుల సమీకరణ పూర్తి చేసి, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ఈ మెట్రో ప్రాజెక్ట్ పూర్తితో వైజాగ్ రూపురేఖలు అంతర్జాతీయ స్థాయి మెట్రోపాలిటన్ నగరాల సరసన నిలవడం ఖాయంగా కనిపిస్తోంది.

# నలుగురు జెన్‌జీలకు కోటంరెడ్డి టిక్కెట్లు

**నెల్లూరు, సెప్టెంబర్ 25, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో సరికొత్త నాయకత్వానికి బాటలు వేసే దిశగా అధికార కూటమి వ్యూహాత్మక అడుగులు వేస్తోంది. రాజకీయాల్లో పేరుకుపోయిన సంప్రదాయ మూస ధోరణిని బద్దలు కొడుతూ, డిజిటల్ యుగంలో పెరిగిన జెన్ జీ యువతను ప్రత్యక్ష ప్రజా జీవితంలోకి ఆహ్వానించాలన్న సరికొత్త కాన్సెప్ట్‌ను తెరపైకి తెస్తోంది. తలలు పండిన తర్వాతే ప్రత్యక్ష ఎన్నికల్లోకి రావాలన్న పాతకాలపు నిబంధనలను పక్కనపెట్టి, సమాజం పట్ల బాధ్యత, సామాజిక చైతన్యం, యువ రక్తంలో ఉన్న ఫైర్‌ను గుర్తించి వారిని కార్పొరేటర్లు, కౌన్సిలర్లుగా నిలబెట్టేందుకు క్షేత్రస్థాయిలో కసరత్తు ముమ్మరం చేసింది. ఈ విప్లవాత్మక మార్పునకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తీసుకున్న తాజా నిర్ణయం ఒక బలమైన నాందిగా నిలిచింది. తన నియోజకవర్గ పరిధిలోని నగరపాలక సంస్థ డివిజన్లలో నలుగురు యువ జెన్ జీ అభ్యర్థులకు టిక్కెట్లు కేటాయించడమే కాకుండా, వారి ఎన్నికల ఖర్చు మొత్తాన్ని తానే స్వయంగా భరిస్తానని ఆయన ప్రకటించడం రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారింది. రాజకీయాలంటే కేవలం ధనబలం, కుల సమీకరణాలు, పాతతరం నేతలకే పరిమితం కాదనే స్పష్టమైన సందేశాన్ని ఇది ప్రజల్లోకి పంపింది. ఇదే మోడల్‌ను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కీలక నగరాలు, మేజర్ మున్సిపాలిటీల్లో అమలు చేసి, విద్యావంతులైన యువతను రాజకీయాల్లోకి లాగాలని కూటమి పెద్దలు భావిస్తున్నారు. ప్రస్తుత సమాజంలో ఓటరు నాడిని పరిశీలిస్తే.. సాంకేతికత, ఆధునిక ఆలోచనలు, వేగవంతమైన నిర్ణయాలు తీసుకునే నాయకత్వాన్నే నేటి తరం కోరుకుంటోంది. సోషల్ మీడియా ద్వారా ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చే యువతీయువకులు పాలనా వ్యవస్థలో భాగస్వాములయితే స్థానిక సంస్థల పనితీరు సమూలంగా మారుతుందని కూటమి విశ్లేషిస్తోంది. ఈ సరికొత్త ప్రయోగం వెనుక ఉన్న అసలు రాజకీయ లక్ష్యం భవిష్యత్ నాయకత్వ నిర్మాణం . టీడీపీ, జనసేన శ్రేణుల్లో రాబోయే రెండు మూడు దశాబ్దాల రాజకీయాలను శాసించగల బలమైన ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకత్వాన్ని ఈ మున్సిపల్ పోరు నుంచే తయారు చేయాలని చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ లక్ష్యంగా పెట్టుకున్నారు. క్షేత్రస్థాయిలో వార్డు, డివిజన్ స్థాయి నుంచే ప్రజలతో మమేకమై పనిచేసే నాయకులను తీర్చిదిద్దడం వల్ల పార్టీల సంస్థాగత పునాదులు మరింత పటిష్టమవుతాయని వారు గట్టిగా విశ్వసిస్తున్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు కేవలం పార్టీల బలపరీక్షగానే కాకుండా.. సంప్రదాయ పాతతరం రాజకీయాలకు, ఆవేశం–ఆలోచన కలగలిసిన కొత్తతరం ఆలోచనలకు మధ్య జరిగే పరివర్తనగా మారనున్నాయి. యువతకు టిక్కెట్లు ఇవ్వడంతో పాటు వారిని గెలిపించుకోగలిగితే, ఏపీ రాజకీయాల్లో ఇదొక సువర్ణ అధ్యాయంగా మిగిలిపోనుంది. ఒకప్పుడు రాజకీయాలంటే భయపడి దూరంగా ఉన్న విద్యావంతులైన యువత, నేడు స్థానిక పాలనను తమ చేతుల్లోకి తీసుకునేందుకు సిద్ధమవుతుండటం రాష్ట్ర ప్రజాస్వామ్య వ్యవస్థకు శుభపరిణామం అవుతుందనడంలో సందేహం లేదు.

# ఆసియా క్రీడల్లో గుల్వీర్ సింగ్ సత్తా.. 10,000 మీటర్లలో సిల్వర్ మెడల్!



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత లాంగ్ డిస్టెన్స్ రన్నర్ గుల్వీర్ సింగ్ మరోసారి తన సత్తా ఏంటో ప్రపంచానికి చాటి చెప్పారు. 2026 ఆసియా క్రీడలలో పురుషుల 10,000 మీటర్ల ఫైనల్స్‌లో అద్భుతమైన ప్రతిభ కనబరిచి రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ హోరాహోరీ రేసును ఆయన కేవలం 28:29.38 నిమిషాల టైమింగ్‌తో పూర్తి చేసి ట్రెండింగ్‌లో నిలిచారు.

**గుల్వీర్ సక్సెస్ జర్నీ:**
అంతర్జాతీయ వేదికలపై గుల్వీర్ సింగ్ తన పరుగుతో తిరుగులేదని నిరూపిస్తున్నారు. ఈ తాజా గెలుపుతో ఆయన తన కెరీర్‌లో మరో భారీ అంతర్జాతీయ పతకాన్ని జమ చేసుకున్నారు. సరిగ్గా చెప్పాలంటే, గతంలో 2023లో జరిగిన హాంగ్జౌ ఏషియన్ గేమ్స్‌లోనూ అతడు కాంస్య పతకం సాధించి అదరగొట్టారు.

**గుల్వీర్ సింగ్ పతకాలు:**
ఇటీవలే ముగిసిన 2026 కామన్వెల్త్ గేమ్స్‌లోనూ గుల్వీర్ అదరగొట్టారు. అక్కడ 27:49.78 సమయంలో రేసును పూర్తి చేసి రజత పతకాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. ఇక రికార్డుల విషయానికి వస్తే.. 2025లో ఏకంగా 27:00.22 సమయంలో లక్ష్యాన్ని చేరుకుని జాతీయ 10,000 మీటర్ల రికార్డును తన పేరిట లిఖించుకున్నారు. అంతకంటే ముందు గత ఏడాదే ఏషియన్ టైటిల్‌ను కూడా కైవసం చేసుకున్నారు. దీంతో ఆసియా ఖండంలోనే టాప్ డిస్టెన్స్ రన్నర్లలో ఒకరిగా తన స్థానాన్ని పదిలం చేసుకున్నారు.

**ఇండియన్ అథ్లెటిక్స్ గర్వించదగ్గ స్టార్:**
అంతర్జాతీయ గేమ్స్ లో వరుస విజయాలతో దూసుకుపోతున్న గుల్వీర్ సింగ్, ఈ ఆసియా క్రీడలలోనూ తన సూపర్ ఫామ్‌ను కంటిన్యూ చేశారు. ఈ తాజా పోడియం ఫినిష్‌తో అతడు అంతర్జాతీయ వేదికలపై భారత్ కీర్తిని మరో మెట్టు ఎక్కించారు.

# భారత్ 2027 వరల్డ్ కప్ ప్లాన్ ఇదేనా? రోహిత్, కోహ్లీపై గంభీర్ వ్యాఖ్యలు వైరల్!



**హైదరాబాద్ పెన్ పవర్:** వెస్టిండీస్‌తో త్వరలో జరగనున్న 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భారత యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల రూపంలో అత్యంత అనుభవజ్ఞులైన ఆటగాళ్ల అండ లభిస్తోందని ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ పేర్కొన్నారు. గతేడాది వన్డే కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన గిల్ నాయకత్వానికి ఈ సీనియర్ల అనుభవం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.

**గంభీర్ ప్రశంసలు - కోహ్లీ, రోహిత్ పాత్ర:**
జియోస్టార్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కోచ్ గంభీర్ మాట్లాడుతూ.. వన్డే క్రికెట్‌లో రోహిత్, విరాట్ లాంటి దిగ్గజాలు మైదానంలోనూ, మైదానం బయట గిల్‌కు సహాయపడే స్థితిలో ఉండటం అతడు చేసుకున్న అదృష్టమని వెల్లడించారు. ముఖ్యంగా యువ వయసులో ఉద్వేగాలకు లోనయ్యే ఛాన్స్ ఉంటుందని, కానీ గిల్ భావోద్వేగాలను పక్కన పెట్టి ప్రశాంతంగా వ్యవహరిస్తున్నాడని గౌతమ్ గంభీర్ కొనియాడారు.

**గిల్ లీడర్‌షిప్ స్టైల్ పై కోచ్ అంచనాలు:**
26 ఏళ్ల శుభ్‌మన్ గిల్ తన నాయకత్వ లక్షణాలతో అన్ని విభాగాల్లోనూ అద్భుతంగా రాణిస్తున్నాడని గౌతమ్ గంభీర్ ప్రశంసించారు. గిల్ ఎంతో ప్రశాంతంగా, నిస్వార్థంగా, దూకుడుగా వ్యవహరిస్తూ కేవలం పరుగులతోనే కాకుండా తన ఆచరణ ద్వారా జట్టుకు ఆదర్శంగా నిలుస్తున్నాడని పేర్కొన్నాడు. వన్డే క్రికెట్‌లో గిల్‌కు ఇటీవలి కాలంలో కొంత కష్టకాలం ఎదురైనప్పటికీ, అతడు సరైన మార్గంలోనే పయనిస్తున్నందున త్వరలోనే మెరుగైన ఫలితాలు వస్తాయని గంభీర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

**భారత్ వర్సెస్ వెస్టిండీస్ సిరీస్ షెడ్యూల్:**
ఈ సిరీస్‌లో భాగంగా తొలి వన్డే సెప్టెంబర్ 27వ తేదీన తిరువనంతపురంలోని గ్రీన్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరగనుంది. రెండో వన్డే సెప్టెంబర్ 30న గువహటిలోనూ, మూడో వన్డే అక్టోబర్ 3న న్యూ చండీగఢ్‌లోనూ నిర్వహించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆ తర్వాత ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ జరగనుండగా, అది అక్టోబర్ 17వ తేదీన బెంగళూరులో ముగుస్తుంది. ఈ జట్టులో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలతో పాటు వైస్ కెప్టెన్‌గా కేఎల్ రాహుల్ కూడా కొనసాగుతున్నారు.

**వెస్టిండీస్‌పై గిల్ అద్భుత రికార్డు:**
వెస్టిండీస్ జట్టుపై శుభ్‌మన్ గిల్‌కు అద్భుతమైన రికార్డు ఉంది. విండీస్‌పై ఇప్పటి వరకు 6 వన్డే మ్యాచ్‌లు ఆడిన గిల్ 66.2 సగటుతో, 92.71 స్ట్రైక్ రేట్‌తో మొత్తం 331 పరుగులు సాధించారు. ఇందులో అతని అత్యధిక వ్యక్తిగత స్కోరు 98 పరుగులు.. సీనియర్ ఆటగాళ్ల అనుభవాన్ని అందిపుచ్చుకుంటూ గిల్ తన కెప్టెన్సీ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించనున్నారు.

# 66 -- 28తో థాయ్‌లాండ్ చిత్తు.. ఆసియా గేమ్స్ కబడ్డీ ఫైనల్‌లోకి టీమిండియా!

**హైదరాబాద్ పెన్ పవర్:** పాన్‌లోని ఐచి-నగోయా వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడలు కబడ్డీ టోర్నమెంట్‌లో భారత పురుషుల జట్టు కిరాక్ ప్రదర్శనతో చెలరేగింది. టోకై సిటిజన్స్ జిమ్నాసియంలో జరిగిన ఉత్కంఠభరితమైన సెమీఫైనల్ పోరులో డిఫెండింగ్ చాంపియన్ భారత్ 66--28 తేడాతో థాయిలాండ్‌ను చిత్తు చేసి ఫైనల్‌లోకి దూసుకెళ్లింది.

**ఆరంభం నుంచే ఆధిపత్యం:**
గ్రూప్-ఏ లో అన్ని మ్యాచ్‌లు గెలిచి అగ్రస్థానంతో సెమీస్‌లోకి అడుగుపెట్టిన భారత జట్టు, నాకౌట్ దశలో ఎలాంటి తడబాటు లేకుండా ఆడింది. ఇండియన్ డిఫెన్స్ విభాగంలో జైదీప్ దహియా, సుమిత్, రాహుల్ సేథ్‌పాల్, కెప్టెన్ సునీల్ కుమార్ అద్భుతంగా ఆడాడు. ఎనిమిది సార్లు ఆసియా క్రీడల కబడ్డీ చాంపియన్‌గా నిలిచిన భారత్, మ్యాచ్ ప్రారంభమైన మొదటి 5 నిమిషాల వ్యవధిలోనే థాయిలాండ్‌ను తొలిసారి ఆల్‌ఔట్ చేసి పూర్తి ఆధిక్యాన్ని సంపాదించింది.

**థాయిలాండ్ ప్రతిఘటన - భారత రెయిడర్ల జోరు:**
మొదటి ఎదురుదెబ్బ నుంచి థాయిలాండ్ జట్టు మెల్లగా కోలుకుంది. థాయిలాండ్ ప్లేయర్ ధీరడెట్ చైసిత్ కొన్ని సంచనాత్మక సూపర్ రెయిడ్స్‌తో పాటు వరుస సక్సెస్‌ఫుల్ రెయిడ్స్‌తో విరుచుకుపడ్డాడు. ఆశ్చర్యకరంగా భారత్‌ను ఆల్- ఔట్ చేసి స్కోరును 24-14 కు తగ్గించాడు. కానీ, భారత రెయిడర్ దేవంక్ దలాల్ అద్భుతమైన ప్రదర్శనతో విజృంభించారు. మొదటి హాఫ్ ముగిసేసరికి భారత్ 37--18 ఆధిక్యంలో నిలిచింది.

**సెకండ్ హాఫ్ లోనూ తగ్గని జోరు:**
రెండో అర్ధభాగంలోనూ మ్యాచ్‌పై భారత జట్టు పూర్తి నియంత్రణ సాధించింది. థాయిలాండ్ తరఫున చైసిత్ ఒంటరి పోరాటం చేసినప్పటికీ, టీమిండియా వ్యూహాత్మకంగా ఆడుతూ మరో రెండుసార్లు థాయిలాండ్‌ను ఆల్- ఔట్ చేసింది. చివరికి 66-28 భారీ స్కోరుతో ఘన విజయం సాధించి ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది.

**స్వర్ణ పతక పోరుకు సర్వం సిద్ధం:**
(సెప్టెంబర్ 26, శనివారం) జరిగే ఏషియన్ గేమ్స్ 2026 కబడ్డీ స్వర్ణ పతక పోరులో భారత్.. ఇరాన్, చైనీస్ తైపీ జట్ల మధ్య జరిగే మరో సెమీఫైనల్ విజేతతో తలపడనుంది. ఆసియా

క్రీడల కబడ్డీ చరిత్రలో 1--0 తో ఎడిషన్లలో ఇండియా ఫైనల్ చేరడం ఇది తొమ్మిదోసారి కావడం విశేషం. కాగా, 2018 జకార్తా గేమ్స్‌లో కాంస్యంతో సరిపెట్టుకోవడం మినహా ప్రతీసారి భారత్ ఫైనల్‌కు చేరుకుంది. ఈ టోర్నమెంట్‌లో కాంస్య పతక పోరు ఉండదని, సెమీఫైనల్స్‌లో ఓడిన రెండు జట్లు పోడియం స్థానాలను దక్కించుకుంటాయని నిర్వాహకులు తెలిపారు.

# నిఖిల్- తేజ అన్నదమ్ముల్లా ఒకే మార్గంలో!









టాలీవుడ్‌లో సరికొత్త కంటెంట్‌తో పాన్ - ఇండియా స్థాయిలో తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోలు నిఖిల్ సిద్ధార్థ్, తేజా సజ్జా. వైవిధ్యమైన కథాంశాలను ఎంచుకుంటూ కాన్సెప్ట్ ఆధారిత చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద విజయం సాధించడంలో ఇద్దరి శైలి ఒకేలా కనిపిస్తుంది. వినూత్న ప్రయోగాలకు ప్రాధాన్యమిస్తూ, ఒకే రకమైన విజన్‌తో ప్రయాణిస్తున్న ఇద్దరు నటులు పరిశ్రమలో అన్నదమ్ముల్లా ఒకే బాటలో పయనిస్తున్నారనే అభిప్రాయం విశ్లేషకుల్లో వ్యక్తమవుతోంది.

-కార్తికేయ 2- చిత్రంతో జాతీయ స్థాయిలో అద్భుత విజయాన్ని అందుకున్న నిఖిల్ తదుపరి ప్రాజెక్ట్‌లను కూడా అదే స్థాయిలో ప్లాన్ చేసుకుంటున్నారు. ప్రయోగాత్మక కథలను ఎంచుకుంటూనే సాంస్కృతిక, చారిత్రక అంశాలకు ప్రాధాన్యమిచ్చే భారీ చిత్రాలలో నటిస్తున్నారు. ఆయన లైనప్‌లో ప్రస్తుతం -స్వయంభూ- పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపుదిద్దుకుంటోంది. వీటితో పాటు చారిత్రక ప్రాధాన్యత ఉన్న -ది ఇండియా హౌస్- అనే మరో పాన్ -ఇండియా చిత్రం లైన్లో ఉంది. తిరుగులేని బ్లాక్‌బస్టర్ అందించిన ఫ్రాంచైజీలో రాబోతున్న -కార్తికేయ 3- పనులు జరుగుతున్నాయి.

మరోవైపు చైల్డ్ ఆర్టిస్ట్‌గా పరిశ్రమలోకి వచ్చి -హను-మాన్- చిత్రంతో పాన్ ఇండియాలో క్రేజ్ సంపాదించుకున్నారు తేజా సజ్జా. ఫాంటసీ, మైథాలజీ, గ్రాఫికల్ విజువల్స్‌తో కూడిన కథలను నమ్ముకుంటూ తనకంటూ ప్రత్యేక మార్గాన్ని సుగమం చేసుకున్నారు. ప్రస్తుతం తేజ నటిస్తోన్న -మిరాయి2- చిత్రం సూపర్ హీరో యాక్షన్ అడ్వెంచర్‌గా తెరకెక్కుతుండగా .. -జాంబీ రెడ్డి- సీక్వెల్ గా -జాంబీ రెడ్డి 2- పనులు కూడా ముమ్మరంగా సాగుతున్నాయి.

ఇలా ఇద్దరి లైనప్‌లను గమనిస్తే కొన్ని ఆసక్తికరమైన సమానత్వాలు కనిపిస్తాయి. ఇద్దరూ రొటీన్ కమర్షియల్ ఫార్మాట్లకు దూరంగా ఉంటున్నారు. విజువల్స్‌కు ప్రాధాన్యత ఉన్న కాన్సెప్ట్‌లకే జై కొడుతున్నారు. ఒకరికి కార్తికేయ సిరీస్ ఎలాగైతే గ్లోబల్ గుర్తింపు తెచ్చిపెట్టిందో? మరొకరికి -హను-మాన్- క్రేజ్ తెచ్చింది. మైథాలజీ, హిస్టరీ, అడ్వెంచర్ ఎలిమెంట్స్ మిళితం చేసిన కథలను

ఎంచుకోవడంలో నిఖిల్, తేజలు ఒకే మైండ్‌సెట్‌తో ముందుకెళ్తున్నారు. ఈ రకమైన కంటెంట్ ఓరియెంటెడ్ ఎంపికలు టాలీవుడ్ స్థాయిని అంతర్జాతీయ వేదికపైకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. కేవలం ప్రాంతీయ మార్కెట్‌కే పరిమితం కాకుండా ఉత్తరాది ప్రేక్షకులతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఆకట్టుకునేలా ఇద్దరు సబ్జెక్ట్‌లను ఎంచుకుంటున్నారు. భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతున్న సినిమాలు బాక్సాఫీస్ వద్ద సేఫ్ బెట్‌గా మారడమే కాకుండా యంగ్ జనరేషన్ హీరోలకు కొత్త దిశానిర్దేశం చేస్తున్నాయి.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At Shop No: 9, Bunny Xerox, Rtc Comlex, Kavali, Nellore Dist, Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2835" e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965